ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 29.4 ၊ కనిష్ఠం 16.8

కామారెడ్డి
జిల్లా వార్తలు
5
ఆదివారం 1 డిసెంబరు 2024


6, 7న జిల్లా స్థాయి బాల వైజ్ఞానిక అవార్డుల ప్రదర్శన

కామారెడ్డి టౌన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని బాన్సువాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 6,7 తేదీల్లో 52వ జిల్లాస్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన, 12వ జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ అవార్డుల ప్రదర్శన చేపట్టనున్నట్లు జిల్లా సైన్స్ అధికారి సిద్ధిరాంరెడ్డి తెలిపారు. 6న రిజిస్ట్రేషన్, ప్రారంభోత్సవ కార్యక్రమం, ప్రదర్శనలు, న్యాయ నిర్ణేతలచే జడ్జిమెంట్, సాయంత్రం శాస్త్ర సాంస్కృతిక కార్యక్రమాలు, వక్తల సందేశాలు, 7న వివిధ పాఠశాలల నుంచి వచ్చిన బాల శాస్త్రవేత్తలకు విద్యా అభిమానులకు ప్రదర్శన తిలకించే అవకాశం, సాయంత్రం బహుమతుల ప్రదానోత్సవం, ముగింపు కార్యక్రమం చేపడుతామని తెలిపారు.



ఉమ్మడి జిల్లాను.. మంత్రి పదవి వరించేనా?

- ఇప్పటికీ ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలకు దక్కని మంత్రి, విప్ పదవి
- అభివృద్ధి పనులపై ప్రభావం
- ఇతర జిల్లాలకు దీటుగా రాని నిధులు



నిజామాబాద్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం దగ్గర పడుతోంది. ఇప్పటికీ ఉమ్మడి జిల్లాకు మంత్రి లేదు. కనీసం విప్ లేదు. ఉమ్మడి జిల్లాలో అధికార పార్టీ ఎమ్మెల్యేలు ఉన్నా గుర్తింపు లేదు. క్యాబినెట్‌లో ఆరు మంత్రి పదవులు ఖాళీ ఉన్నా ఉమ్మడి జిల్లాకు ప్రాతినిధ్యం లేదు. రెండో విడతలో ఉమ్మడి జిల్లాకు అవకాశం వస్తుందని ఎదురు చూస్తున్నా విస్తరణ లేదు. మంత్రి లేకపోవడం వల్ల సంవత్సరం నుంచి ఉమ్మడి జిల్లా అభివృద్ధి పనులపైన ప్రభావం పడుతోంది. పూర్తిస్థాయిలో సమీక్షించే వారు లేకపోవడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అధికార సలహాదారులు ఇద్దరు ఉన్నా మంత్రి లేకపోవడం వల్ల ఉమ్మడి జిల్లాకు రావాల్సినంత నిధులు కూడా రావడం లేదు. కీలకమైన ప్రాజెక్టు పనులతో పాటు ఇతర అభివృద్ధి పనులు కూడా నిలిచిపోతున్నాయి. ఎమ్మెల్యేల పరిధిలో సమీక్షించి నిర్ణయం తీసుకుంటున్నా ఉమ్మడి జిల్లా పరిధిలో పనులను సమీక్షించడంతో పాటు దిశా నిర్దేశం చేసేందుకు మంత్రి, అదే హోదాలో ఉన్న చీఫ్ విప్ కానీ, సహాయ మంత్రి హోదాలో ఉన్న విప్ లేకపోవడం వల్ల సమస్యలు ఎదురవుతున్నాయి. ప్రతీసారి అవకాశం వస్తుందని ఎమ్మెల్యేలు ఎదురు చూస్తున్నా ఇప్పటి వరకు మాత్రం మంత్రి పదవులు భర్తీ కాలేదు. మంత్రులు ఉన్న జిల్లాలకు వచ్చినన్ని నిధులు రాకపోవడం వల్ల అభివృద్ధి కూడా కుంటుపడుతోంది. ఉమ్మడి జిల్లాకు మంత్రి పదవి ఇవ్వాలని కాంగ్రెస్ నేతలతో పాటు ప్రజలు కూడా విజ్ఞప్తులు చేస్తున్నా పట్టించుకునేవారు మాత్రం లేరు.

మంత్రి పదవుల ఊసే లేదు

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం దగ్గర పడుతోంది. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చాలా జిల్లాలకు ప్రాతినిధ్యం ఇచ్చిన నిజామాబాద్, ఆదిలాబాద్, రంగారెడ్డి ఉమ్మడి జిల్లాలకు మంత్రి పదవులు దక్కలేదు. రాష్ట్రంలో 18 మంత్రులకు అవకాశం ఉన్నా ప్రస్తుతం 12 మందే ఉన్నారు. మిగతా ఆరు మంత్రి పదవులు ఖాళీగా ఉన్నాయి. సంవత్సరం అవుతున్నా ఆ పదవుల భర్తీ ఊసే లేదు. మంత్రులు లేని జిల్లాలకు ఇన్‌చార్జి మంత్రులను నియమించినా పూర్తిస్థాయిలో పనులు జరగడం లేదు. ఉమ్మడి జిల్లా నుంచి క్యాబినెట్‌లో ప్రాతినిధ్యం లేకపోవడం వల్ల అభివృద్ధిపైన ఆ ప్రభావం కనిపిస్తోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలోని తొమ్మిది నియోజకవర్గాల పరిధిలో నలుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గెలిచారు. వీరిలో బోధన్, నిజామాబాద్ రూరల్, ఎల్లారెడ్డి, జుక్కల్ నియోజకవర్గాలు ఉన్నాయి. బోధన్ నుంచి ఎంపికైన మాజీ మంత్రి, ఎమ్మెల్యే పి.సుదర్శన్‌రెడ్డి గతంలో మూడు దఫాలు ఎమ్మెల్యేగా పని చేశారు. రాష్ట్ర క్యాబినెట్‌లో మంత్రిగా ఉన్నారు. ఇరిగేషన్, వైద్య ఆరోగ్యశాఖతో పాటు ఇతర శాఖలను నిర్వహించారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటు కాగానే ఉమ్మడి జిల్లా నుంచి ఆయనకు అవకాశం వస్తుందని అందరూ అంచనా వేశారు. మొదటి దఫాలో ఆయనకు అవకాశం కల్పించలేదు. ఉమ్మడి జిల్లా నుంచి ఎవరికి అవకాశం ఇవ్వలేదు. నిజామాబాద్ రూరల్ నుంచి గెలిచిన ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి, ఎల్లారెడ్డి నుంచి గెలిచిన మదన్‌మోహన్‌రావు, జుక్కల్ నుంచి గెలిచిన లక్ష్మీకాంత్‌రావు మొదటి సారి ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. ఇతర జిల్లాల పరిధిలో ఉమ్మడి జిల్లాకు సంబంధించి మంత్రి పదవులతో పాటు ఒకరు లేదా ఇద్దరికి విప్‌లు ఇచ్చారు. మంత్రితో పాటు విప్‌లకు హోదాలు ఉండటం వల్ల పనులను సమీక్షించే అవకాశం ఉంది. కొన్ని ఉమ్మడి జిల్లా పరిధిలో ఇద్దరు లేదా ముగ్గురికి కూడా మంత్రి పదవుల్లో అవకాశం ఇచ్చారు.

ఉమ్మడి జిల్లాకు మొండి చెయ్యేనా?

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు సంబంధించి ఎవరికి ఇప్పటి వరకు పదవి ఇవ్వకపోవడంతో మొండి చెయ్యి చూపించినట్లైంది. రాష్ట్ర మంత్రి వర్గంలో సీనియర్ ఎమ్మెల్యే మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డికి అవకాశం ఉంది. పార్టీ నేతలు చెబుతున్నా ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో నిర్ణయం జరగలేదు. ఆయనతో పాటు మరొకరికి విప్ పదవి వస్తుందని పార్టీ నేతలు బాహాటంగా చెబుతున్నారు. ఇప్పటికీ మాత్రం ఇంకా స్పష్టత రాలేదు. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఉమ్మడి జిల్లా పరిధిలో ఐదుగురికి కార్పొరేషన్ చైర్మన్లుగా అవకాశం కల్పించారు.

కార్పొరేషన్ పదవులతోనే సరిపెడుతున్న వైనం

జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, అన్వేష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్, సీనియర్ నేత తాహెర్‌బిన్ హుందాన్, కాసుల బాల్‌రాజ్‌కు కార్పొరేషన్ చైర్మన్లుగా అవకాశం ఇచ్చారు. సీనియర్ నేత మాజీ అధ్యక్షుడు గడుగు గంగాధర్‌కు రాష్ట్ర వ్యవసాయ కమిషన్‌లో సభ్యుడిగా అవకాశం కల్పించారు. ప్రభుత్వం ఏర్పడగానే మాజీ మంత్రి షబ్బీర్ అలీకి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా నియామకం చేశారు. క్యాబినెట్ హోదాను కల్పించారు. రాజకీయ పరిణామాల తర్వాత బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డికి వ్యవసాయ సలహాదారుగా అదే హోదాలో నియమించారు. జిల్లాకు చెందిన సీనియర్ నేత పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్‌కు మొదట ఎమ్మెల్సీగా నామినేట్ చేశారు. తర్వాత రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించారు. ఇంత మంది ఉమ్మడి జిల్లా పరిధిలో పదవుల్లో ఉన్నా పూర్తిస్థాయిలో సమీక్షించేందుకు మాత్రం మంత్రి లేరు. కనీసం సహాయ మంత్రి హోదా ఉన్న విప్ లేరు.

కుంటుపడుతున్న అభివృద్ధి

పనులను నిత్యం అధికారులతో సమీక్షించడంతో పాటు కావాల్సిన నిధులు తెప్పించేందుకు మంత్రి లేకపోవడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కీలకమైన పనులు వాయిదా పడుతున్నాయి. కొన్ని పనులకు నిధులు లేక నిలిచిపోతున్నాయి. కొన్ని అభివృద్ధి పనులు పూర్తయ్యే దశలో ఉన్నా నిధులు రాక పనులు అర్థాంతరంగా ఆగిపోతున్నాయి. ఆయా నియోజకవర్గాల పరిధిలో ఎమ్మెల్యేలు సమీక్షిస్తున్నా శాఖల మధ్య పూర్తిస్థాయిలో సమన్వయం చేస్తూ మంత్రి హోదాలో సమీక్షించేవారు లేకపోవడం వల్ల పనులు కావడం లేదు. ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా జూపల్లి కృష్ణారావును ఎక్సైజ్ శాఖ మంత్రిని నియమించారు. అప్పటి నుంచి ఆయన జిల్లాకు వస్తున్నా పూర్తిస్థాయిలో సమయం కేటాయించకపోవడం వల్ల సమస్యలు ఎదురవుతున్నాయి. ఉమ్మడి జిల్లా పరిధిలో అన్ని శాఖలను పూర్తిస్థాయిలో సమీక్షించడంతో పాటు నెలకోసారి పనుల ప్రగతిని తెలుసుకుంటూ కావాల్సిన నిధులను సమకూర్చేందుకు ఉమ్మడి జిల్లా పరిధిలో మంత్రి ఉంటే ప్రజలకు ఎంతో ఉపయోగపడనుంది. అభివృద్ధి పనులు కూడా జరుగనున్నాయి. ఉమ్మడి జిల్లా పరిధిలో మంత్రి లేకపోవడం వల్ల సాగు నీటి శాఖ, రోడ్లు, భవనాలు, పంచాయతీరాజ్‌తో పాటు ఇతర శాఖల పనులు కూడా నిలిచిపోతున్నాయి.

పాఠశాలల్లో మౌలిక వసతుల కరువు

కోట్ల రూపాయల నిధులు అవసరమున్నా పాఠశాలల మౌలిక వసతుల పనులు కూడా సమీక్షించకపోవడం వల్ల తగిన ప్రగతి కనిపించడం లేదు. మంత్రివర్గ విస్తరణ చేపట్టి ఉమ్మడి జిల్లా నుంచి మంత్రి పదవి ఒకరికి ఇస్తే జిల్లాలో అభివృద్ధి పనులు వేగంగా జరిగే అవకాశం ఉంది. ఎమ్మెల్యేలతో పాటు పార్టీ సీనియర్ నేతలు, ఇతర నాయకులు కూడా మంత్రిని నియమించాలని కోరుతున్నారు. పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జీలతో పాటు ఏఐసీసీ నేతలకు వివరిస్తున్నారు. సీఎంను కలుస్తూ అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. సంవత్సరం గడుస్తున్న తరుణంలో రెండో విడత మంత్రివర్గ విస్తరణ చేపట్టి ఉమ్మడి జిల్లా నుంచి సీనియర్ నేతకు అవకాశం కల్పిస్తే అభివృద్ధి పనులు వేగవంతమయ్యే అవకాశం ఉంది. ఇప్పటికే జిల్లాలో సంవత్సరకాలం పాటు మంత్రి లేకపోవడం వల్ల ఆ ప్రభావం కనిపిస్తుందని ఇంటలిజెన్స్ వర్గాలు కూడా ప్రభుత్వానికి నివేదిక ఇచ్చినట్లు తెలుస్తోంది. కొన్ని శాఖల అధికారులపై పర్యవేక్షణ లేకపోవడం వల్ల ఇష్టారీతిన వ్యవహరిస్తున్నట్లు ఆ నివేదికలో పేర్కొన్నట్లు తెలుస్తోంది.

అవగాహన లేకుంటే అనర్థమే!

- జిల్లాలో తగ్గుముఖం పట్టిన హెచ్‌ఐవీ కేసులు
- అవగాహన కార్యక్రమాలతో పూర్తిస్థాయిలో నివారణకు అధికారుల చర్యలు
- హెచ్‌ఐవీ సోకిన గర్భిణుల నుంచి పుట్టే బిడ్డకు సోకకుండా కాపాడే ప్రయత్నాలు



7

నియోజకవర్గ అభివృద్ధికి నిధుల విడుదల

- నియోజకవర్గానికి రూ.పది కోట్లు మంజూరు
- పనుల కోసం సిఫారసులు చేస్తున్న ఎమ్మెల్యేలు
- బాన్సువాడకు రూ. 5కోట్ల నిధుల విడుదల



7

ఎల్ఆర్ఎస్ దరఖాస్తులన్నీ పెండింగ్‌లోనే..!

- మందకొడిగా ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల అనుమతులు
- ఎల్ఆర్ఎస్ కోసం వచ్చిన దరఖాస్తులు 33,814 8.. అనుమతి ఇచ్చినవి కేవలం 1500 మాత్రమే



7

విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి

కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

కామారెడ్డి టౌన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): పాఠశాలలు, వసతి గృహాల్లోని విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యత కలిగి ఉండే విధంగా ఆయా ఇన్‌చార్జీల పర్యవేక్షణ నిర్వహిస్తూ ఉండాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లాలోని మండల విద్యాధికారులు, వసతి గృహాల సంక్షేమ అధికారులకు ఆహారభద్రతపై ఓరియంటేషన్ కమ్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో జరుగుతున్న వార్తలపై జిల్లాలోని యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ముఖ్యంగా పాఠశాలల్లో మధ్యాహ్నభోజనం, వసతి గృహాల్లోని విద్యార్థులకు రుచికరమైన, నాణ్యత గల భోజనం అందించాలని తెలిపారు. ఫుడ్ పాయిజన్ కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. తాగునీరు కలుషితం, వస్తువులు, పదార్థాలు గడువు తేదీ ముగిసినవి వాడకుండా చూడాలని తెలిపారు. బియ్యంలో పురుగులు ఉండకుండా, వంటలు వండే ముందు పరిశీలించాలని తెలిపారు. బియ్యంలో పురుగులు పట్టిన బియ్యంను పౌర సరఫరాల సంస్థకు తిరిగి పంపించాలని సూచించారు. ఎలుకలు రాకుండా చర్యలు తీసుకోవాలని, సరుకులు, బియ్యం సంచులను బెంచీలపై ఏర్పాటు చేయాలని తెలిపారు. వంటలు వండే ముందు సరకులను మంచిగా కడగాలని తెలిపారు. జిల్లాలో ప్రతీ ఇనిస్టిట్యూట్‌కు ఆయా ప్రిన్సిపాళ్లతో కమిటీలను ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ కమిటీ ప్రతిరోజు విద్యార్థులకు అందించే భోజనాలను పరిశీలించాలని, విద్యార్థులతో భోజనాలు చేయాలని తెలిపారు. మండల మానిటరింగ్ అధికారులు ఆయా మండలంలోని స్కూళ్లు, హాస్టళ్లను మానిటరింగ్ చేయాలని తెలిపారు. ఫుడ్ ఇన్‌చార్జ్‌లకు వంటలు వండే వారికి అవసరమైన శిక్షణ సూచనలు అందించాలని తెలిపారు. ఏమైన సమస్యలు వచ్చినప్పుడు అదనపు కలెక్టర్‌కు తెలియజేయాలని అన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే జిల్లా, మండల స్థాయి కమిటీలను ఏర్పాటు చేయడం జరిగిందని ప్రతీ పాఠశాలల్లో, ఇనిస్టిట్యూట్‌లలో కమిటీలను ఏర్పాటు చేయాలని అన్నారు. మండల, డివిజన్ జిల్లా స్థాయి కమిటీలు ఆయా ఇనిస్టిట్యూట్‌లను విజిట్ చేసి విద్యార్థులతో పాటు భోజనాలు చేయాలని తెలిపారు. అంతకుముందు ఫుడ్ ఇన్‌స్పెక్టర్ శిరీష్ పవార్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, జడ్పీ సీఈవో చందర్‌నాయక్, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి దయానంద్, జిల్లా ఎస్‌సీ సంక్షేమ అధికారిణి రజిత, డీఈవో రాజు, మండల విద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలన విజయోత్సవాలు ఘనంగా నిర్వహించాలి

నేటి నుంచి 9వ తేదీ వరకు జిల్లాలో ప్రజాపాలన విజయోత్సవాలు ఘనంగా పెద్ద ఎత్తున నిర్వహించాలని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని శాఖల సమన్వయంతో విజయోత్సవాలు ఘనంగా నిర్వహించాలని అన్నారు. ప్రభుత్వ శాఖల ద్వారా చేపట్టిన కార్యక్రమాల విజయగాదలను తెలిపే విధంగా ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు శ్రీనివాస్‌రెడ్డి, విక్టర్, డీఎఫ్‌వో నిఖిత, జడ్పీ సీఈవో చందర్‌నాయక్, డీపీవో శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రైతు పండుగ కార్యక్రమం వీక్షణ

సదాశివనగర్: మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగిన రైతు పండుగ కార్యక్రమ ప్రత్యక్ష ప్రసారాన్ని శనివారం అడ్లూర్ ఎల్లారెడ్డి రైతువేదికలో కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ రైతులు, జిల్లా అధికారులతో కలిసి వీక్షించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాలుగో దఫాలో ప్రకటించిన రుణమాఫీలో భాగంగా జిల్లాలో 10,157 రైతు కుటుంబాలకు 82.10 కోట్ల మాఫీ జరిగిందని తెలిపారు. ఇప్పటి వరకు 1,01,416 రైతు కుటుంబాలకు రూ.728.47 కోట్ల రూపాయల మేరకు జిల్లాలో రైతు పంట రుణాల మాఫీ జరిగిందని తెలిపారు. ఇప్పటి వరకు 11,365 మంది సన్న వడ్లు పండించిన రైతులకు 37.16 కోట్ల రూపాయలు బోనస్‌గా రైతు ఖాతాల్లో జమ చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఏవో తిరుమల ప్రసాద్, ఆర్డీవో రంగనాథ్‌రావు, పౌర సరఫరాల కార్పొరేషన్ జిల్లా మేనేజర్‌రాజేందర్, జిల్లా సహకార అధికారి రామ్మోహన్, డీఎస్‌వో నరసింహారావు, జిల్లా ఉద్యానవన అధికారిణి జ్యోతి, వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై బీఆర్ఎస్ దుష్ప్రచారం

డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు

కామారెడ్డి టౌన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రజల్లో కాంగ్రెస్‌కు వస్తున్న ఆదరణను ఓర్వలేక బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలపై దుష్ప్రచారం చేస్తున్నారని డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు అన్నారు. శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఫుడ్‌పాయిజన్ ఘటనలపై కేటీఆర్, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి కుట్రలు పన్నుతున్నారని అన్నారు. రైతుభరోసా, ఒకే దఫా 19వేల కోట్ల రుణమాఫీ చేయడంతో పాటు ఇంకా 3వేల కోట్ల రుణం మాఫీ చేయబోతున్నామని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి విద్యకు ప్రాముఖ్యత ఇస్తూ సంక్షేమ హాస్టళ్లలో డైట్, కాస్మోటిక్ చార్జీలను పెంచడంతో పేద విద్యార్థుల్లో విద్యపట్ల ప్రభుత్వ చర్యల పట్ల ఆసక్తి, విశ్వసనీయత పెరిగిందని అన్నారు. దీన్ని దెబ్బతీసి ప్రభుత్వ ప్రతిష్ఠను దిగజార్చేందుకు విద్యార్థుల్లో ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేందుకు ఫుడ్ పాయిజన్ లాంటి కుట్రలను చేస్తున్నారని అన్నారు. 50వేల ఉద్యోగాలను 10 నెలల్లో ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేటి నుంచి మున్సిపాలిటీల్లో

ప్రత్యేక పారిశుధ్యం

- తొమ్మిది రోజుల పాటు నిర్వహణకు ప్రణాళిక
- కార్మికులకు కిట్లు, ఆరోగ్య శిబిరాలు
- పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులు

ఎల్లారెడ్డి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీల పరిధిలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని చేపట్టాలని మున్సిపల్ శాఖ నిర్ణయించింది. స్వచ్ఛ పట్టణంగా మార్పు తేవాలనే ఉద్దేశంతో తొమ్మిది రోజుల పాటు పకడ్బందీగా పారిశుధ్య కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. ఇందుకు సంబంధిత అధికారులు కార్యాచరణ సిద్ధం చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎల్లారెడ్డి మున్సిపాలిటీలో మున్సిపల్ శాఖ వార్డుల వారీగా అధికారులను నియమించారు. అలాగే ఇందుకు అవసరమైన సామగ్రిని ముందుగానే సమకూర్చాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా డిసెంబరు 1 నుంచి 9వ తేదీ వరకు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం పూర్తయ్యే వరకు మున్సిపల్ సిబ్బందికి సెలవులను రద్దు చేస్తున్నట్లు స్పష్టం చేశారు.

సాంస్కృతిక కార్యక్రమాలు

అలాగే స్థానికంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఇందుకు సంబంధించిన స్థానికంగా ఉన్న కళాకారులను గుర్తిస్తారు. పారిశుధ్యం పరిశుభ్రత ప్రభుత్వ పథకాలపై ప్రచారాన్ని చేపడతారు. దేవాలయాలు, ఉద్యాన వనాలు చారిత్రాత్మక ప్రదేశాలు, పర్యాటక కేంద్రాలు, పార్కులు వంటి జన సామూహ ప్రదేశాలకు ఒక్కొక్క రోజుకు ఒక్కో ప్రదేశం వద్ద శుభ్రం చేసేందుకు ప్రణాళికలు చేస్తారు. ఇందులో ప్రధానంగా శుభ్రపరిచే కార్యక్రమాలు చేపడతారు. డిసెంబరు 3న పబ్లిక్ టాయిలెట్లు పాఠశాలలో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌ను నిర్వహిస్తారు.

ఆరోగ్యంపై అవగాహన కల్పించే కార్యక్రమాలు

మున్సిపల్ కార్మికులకు ఈ కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య శిబిరాలను నిర్వహించి పీపీఈ కిట్లను ఈ కార్యక్రమంలో అందజేస్తారు. ప్రత్యేకంగా కార్మికులకు ఆరోగ్య భద్రతపై అవగాహన కల్పిస్తారు. ప్రజా ఆరోగ్యం పరిసరాల పరిశుభ్రతపై కార్యక్రమంలో ప్రాధాన్యత నిస్తూ కార్యక్రమాలు చేపడతారు.



ఎల్లారెడ్డి మున్సిపల్ కార్యాలయం

విజయవంతం చేయు టకు మున్సిపల్ అధికారులు, విద్యుత్, పోలీసు, హెల్త్ డిపార్టుమెంట్, రెవెన్యూ వంటి విభాగాలతో సమన్వయం చేసుకుని కార్యక్రమాలను నిర్వహించాల్సి ఉంటుంది. ఇందుకు సంబంధించి మున్సిపల్ కమిషనర్లు ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ కార్యాచరణ రూపొందించారు.

డిసెంబరు 3న అర్బన్ డే

ఈ ప్రత్యేక కార్యక్రమం పూర్తయ్యే వరకు మున్సిపల్ సిబ్బందికి సెలవులు రద్దు చేశారు. కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయుటలో భాగంగా మున్సిపల్ శాఖ ఈ నిర్ణయం తీసుకుంది. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా డిసెంబరు 3న అర్బన్‌డే పురస్కరించుకుని మున్సిపల్ పనులకు శ్రీకారం చుట్టనున్నారు. అభివృద్ధి పనులు ఇందిరా మహిళా శక్తి యూనిట్లకు చేపట్టనున్నారు. అలాగే ప్రజా పాలన విజయోత్సవ ర్యాలీలు చేపడతారు. మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ కింద ఇందిరా మహిళా శక్తి స్ట్రీట్ వెండర్‌లకు చెక్కులను పంపిణీ చేయనున్నారు. ఇందిరా మహిళా శక్తి స్టాల్స్‌ను కూడా ఏర్పాటు చేస్తారు.

క్లస్టర్ల వారీగా సూపర్ వైజర్ల నియామకం

కార్యకలాపాలు చేపట్టేందుకు వార్డుల వారీగా నోడల్ అధికారులను నియమించడం పర్యవేక్షించేందుకు క్లస్టర్ల వారీగా సూపర్‌వైజర్లను నియమిస్తూ కేటాయించిన వార్డులను పర్యవేక్షిస్తూ రిపోర్టింగ్ చేయనున్నారు. వార్డుల్లో చెత్త ప్రాంతాలను గుర్తించడం మురికి కాలువల పరిస్థితి ప్రధాన రహదారులు వీధులను గుర్తిస్తారు. ప్రతిరోజూ వార్డులలో పారిశుధ్యంతో పాటు మురుగు కాలువలను శుభ్రం చేయించే కార్యక్రమాన్ని చేపడతారు. వాణిజ్య ప్రాంతాల్లోని చెత్త డబ్బులను శుభ్రం చేయిస్తూ రోడ్డు పక్కన వ్యర్థాలను లేకుండా శుభ్రం చేయించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు.

గంజ్‌లో కమీషన్ ఏజెంట్ పరార్!



వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం

ఖిల్లా, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ శ్రద్ధానంద్ గంజ్‌లో ఓ కమీషన్ ఏజెంట్ కనిపించకుండా పోయినట్లు సమాచారం. గత పసుపు సీజన్‌లో చేసిన వ్యాపారానికి గాను రైతులకు ఇవ్వాల్సిన డబ్బులు ఇవ్వకుండా పరారయ్యాడని తెలిసింది. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.గత కొన్నేళ్లుగా శ్రద్ధానంద్‌గంజ్‌లో కమీషన్ ఏజెంట్ గా వ్యవహరిస్తూ రైతులకు వ్యాపారులకు మధ్యవర్తిగా ఉండేవాడు. ఈ ఏజెంట్‌కు గతంలో మంచి పేరు ఉండడంతో రైతులు అధిక సంఖ్యలో ఆయన వద్దకు వెళ్లి పసుపు అమ్మకాలు జరిపేవారు. పసుపు ఇచ్చిన రైతులకు ఇప్పటి వరకు డబ్బులు చెల్లించలేదని తెలిసింది. రైతులకు ఇవ్వాల్సిన డబ్బులు సుమారు కోట్లలో ఉన్నట్లు చర్చ లు జరుగుతున్నాయి. డబ్బులు చెల్లించలేక కొందరికి ఐపి నోటీసులు జారీ చేసినట్లు బయట ప్రచారం జరుగుతుంది. ఆ కమీషన్ ఏజెంట్ గత ఐదు రోజులుగా కనిపించకపోవడంతో పాటు కొందరు నోటీసులు అందుకున్న వారు దుకాణంకు వెళ్లి వాకబు చేయగా వారికి సరైన సమాధానం లభించలేదని తెలిసింది. ఈ విషయమైన మర్చం ట్స్ అసోసియేషన్ ప్రతినిధులతో సంప్రదించగా తమకు ఎటువంటి సమాచారం లేదని చెప్పారు. అదే విధంగా వ్యవసాయ మార్కెట్ కమిటీ అధికారులను సైతం ఈ విషయం గురించి అడుగగా తమకు ఇప్పటి వరకు ఎటువంటి ఫిర్యాదులు రాలేదని చెప్పారు. ఫిర్యాదులు వస్తే ఆ దుఖానం యజమానిని సంప్రదించి తగు చర్యలు తీసుకుంటామని సెలక్షన్ గ్రేడ్ కార్యదర్శి అపర్ణ తెలిపారు. పోలీసులకు కూడా కమీష న్ ఏజెంట్‌పై ఎటువంటి ఫిర్యాదులు రాలేదని మూడవ టౌన్ ఎస్ఐ మహేష్ తెలిపారు. ప్రతీ ఏడు ఇదే సమయానికి గంజ్ నుంచి ఎవరో ఒకరు రైతులకు, ఫైనాన్సీయర్లకు డబ్బులు చెల్లించకుండా పారిపోయినట్లు పుకార్లు వస్తుంటాయి. గతంలో కూడా ఇటువంటి ఘటనలు సైతం జరిగాయి. గంజ్‌లో ఏజెంట్‌లుగా వ్యవహరించిన కొంద రు రైతులకు, ఫైనాన్సీయర్లకు డబ్బులు చెల్లించకుండా దుకాణం బోర్డు తిప్పేశారు. అటువంటి ఘటనకు సంబంధించిన ప్రచారం ప్రస్తుతం జిల్లాలో చక్కర్లుకొడుతోంది.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి


కస్తూర్బాలో విద్యార్థులతో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్


కేజీబీవి పాఠశాలలో రికార్డులు తనిఖీ చేస్తున్న తహసీల్దార్ శ్రీలత


సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

● అడిషనల్ కలెక్టర్ అంకిత్

కోటగిరి,నవంబరు30(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. కోటగిరి మండల కేంద్రంలో శనివారం పాఠశాలలు, వసతి గృహాల్లో విస్తృత తనిఖీలు నిర్వహించారు. కస్తూర్బా పాఠశాలల్లో విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా వాకబు చేశారు. వంటగది, కూరగాయలను పరిశీలించారు. తాగునీటి వసతిపై వాకబు చేశారు. విద్యార్థులకు గదుల కొరత ఉందని కస్తూర్బా ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం మైనారిటీ గురుకుల బాలుర కళాశాలను తనిఖీ చేశారు. వంటగది, నిత్యావసర సరుకులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు. సిలబస్ ఏ మేరకు పూర్తయిందని వాకబు చేశారు. నిర్ణీత గడువు లోపు సిలబస్ పూర్తి చేయాలని, విద్యార్థులకు నాణ్యతతో కూడిన భోజనం అందించాలని సూచించారు. అనంతరం ఎస్సీ వసతి గృహాన్ని తనిఖీ చేశారు. స్టోర్ రూమ్, వంటగది పరిసరాలను పరిశీలించి శుభ్రత పాటించాలని సూచించారు. వంట పాత్రలు శుభ్రంగా ఉంచాలని, నాణ్యమైన ఆహార పదార్థాలను వినియోగించాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ గంగాధర్, ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, మైనారిటీ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ మొబిన్, కస్తూర్బా ఇన్‌చార్జి సవిత రాణి, ఎస్సీ వసతి గృహం వార్డెన్ నరహరి తదితరులున్నారు.

కోటగిరి: విద్యార్థులకు అందించే ఆహారం కలుషితం కాకుండా చూడాలని అడిషనల్ కలెక్టర్ అంకిత్ సూచించారు. రుద్రూరు మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలను శనివారం అడిషనల్ కలెక్టర్ అంకిత్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన వెంట ప్రత్యేక అధికారిణి శ్యామల, తహసీల్దార్ తారాబాయి, ఎంపీడీవో సురేష్ బాబు తదితరులున్నారు.

ఏర్గట్ల: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంను శనివారం స్థానిక తహసీల్దార్ శ్రీలత పరిశీలించారు. అందులో భాగంగా పాఠశాలలోని గదులు, వంట గదలను పరిశీలించి భోజనం చేసి, రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులకు ప్రతీ ఒక్కరికి అందించాలని ఎస్‌వో సంధ్యకు సూచించారు.

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని వేల్పూర్ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో శనివారం మున్సిపల్ కమిషనర్ రాజు తనిఖీ చేశారు. పాఠశాలలోని విద్యార్థులను సమస్యలను అడిగితెలుసుకున్నారు. విద్యార్థులకు వండిన భోజనాన్ని పరిశీలించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్, పూర్ణమౌళి, తదితరులు పాల్గొన్నారు.

భీమ్‌గల్: వసతిగృహాల్లో విద్యార్థులకు కల్పించే సౌకర్యాల పట్ల ఆలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ రామకృష్ణ సిబ్బందికి హెచ్చరించారు. శనివారం పట్టణ కేంద్రం లోని పాఠశాలలను కస్తూర్బాగాంధీ పాఠశాలను మున్సిపల్ కమిషనర్ రామకృష్ణ తనిఖీ చేశారు.

కోటగిరి:పొతంగల్ జిల్లా పరిషత్ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తహసీల్దార్ మల్లయ్య తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.విద్యార్థులకు నాణ్యతతో కూడిన భోజనం అందించాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు పండ్లను పంపిణీ చేశారు. ఆయన వెంట ఎంఈవో శంకర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శంకర్ తదితరులున్నారు.

కమ్మర్‌పల్లి: మండలంలోని నాగాపూర్ ప్రాథమిక పాఠశాలను కమ్మర్‌పల్లి మండల ఎంపీడీవో రాజా శ్రీనివాస్ శనివారం తనిఖీ చేశారు, ఈ సందర్భంగా విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరుశాతం రికార్డులను పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులకు నాణ్యమైన రుచి సుచికరమైన భోజనాలు అందించాలని వంటశాల, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం పాఠశాల రికార్డులను సెలబస్‌ను ఆయన పరిశీలించారు. ఎంపీడీవో వెంట పంచాయతీ కార్యదర్శి, సంధ్య ఉపాధ్యాయులు ఉన్నారు.

బోధన్‌రూరల్: ప్రభుత్వ వసతి గృహాలు, పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని బోధన్ తహసీల్దార్ విఠల్ అన్నారు. శనివారం బోధన్ ఉప విద్యాశాఖ అధికారి కార్యాలయంలో మధ్యాహ్న భోజన కార్మికులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలన్నారు. ప్రభుత్వ ఆదేశాలు, నిబంధనలను తప్పకుండా పాటించాలన్నారు. బియ్యంలో ఇబ్బందులు వస్తే అధికారులను సంప్రదించాలని, వంటశాలల్లో తప్పకుండా పరిశుభ్రత పాటించాలన్నారు. అనంతరం ఎంపీడీవో బాల గంగాధర్ మాట్లాడుతూ ప్రభుత్వ వసతి గృహాలు, పాఠశాలల్లో మంచినీటి ఇబ్బందులు ఉంటే అధికారులకు తెలుపాలని, రెండు రోజుల్లో సమస్యలు పరిష్కరిస్తామన్నారు. వంటగది ప్రాంగణంలో చెప్పులు ఉంచరాదని, వంటగది దగ్గర పిచ్చి మొక్కలు పెరగకుండా పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి నాగయ్య, ఎంపీవో మధుకర్, ఉపాధ్యాయులు బాలచంద్రం, శ్రీనివాస్, మధ్యాహ్న భోజన ఇన్‌చార్జి ఉపాధ్యాయులు, మధ్యాహ్న భోజన కార్మికులు, సీఆర్పీలు విజయ్, యుసుఫ్, బాబు, శివానంద్, రేఖ పాల్గొన్నారు.


డిచ్‌పల్లి కస్తూర్బాగాంధీలో హాజర పట్టికను పరిశీలిస్తున్న ఆర్‌జేడీ

డిచ్‌పల్లి:విద్యాశాఖ రీజినల్ డైరెక్టర్ సత్యనారాయణ శనివారం డిచ్‌పల్లి కేజీబీవీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని రికార్డులు, భోజన వివరాలను స్పెసల్ ఆఫీసర్ సవితను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆర్జేడీ మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రతీ రోజు నాణ్యమైన పౌష్టికాహారం అందజేయాలని త్వరలో పదో తరగతి పరీ క్షలు జరగనున్న నేపథ్యంలో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు తీసుకోవా లని ఆర్జేడీ ఆదేశించారు. కేజీబీవీలో 310మంది విద్యార్థులు విద్యా బోధన సాగిస్తున్నరని ప్రత్యేక అధికారి సవిత ఆర్జేడీకి వివరించారు. అనంతరం ఆయన జిల్లా మాజీ విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్‌తో కలిసి విద్యార్థుల మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు.

రెంజల్: విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఎంపీడీవో వెంకటేష్ అన్నారు. శనివారం మండలంలోని దూపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలను ఆయన సందర్శించారు. ఉపాధ్యాయుల హాజరు పట్టికతో పాటు విద్యార్థుల బోధన తీరును పరిశీలించారు. అనంతరం ప్రభుత్వం విద్యార్థులకు అందించే భోజనాన్ని మెనూ ప్రకారం అందించాలని సూచించారు. ఆహర వస్తువులను శుభ్రంగా ఉంచాలని, వంటగది పరిసరాలను పరిశీలించారు. నాణ్యతతో కూడిన సరుకులను ఉపయోగించాలని పేర్కొన్నారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయురాలు వెంకట లక్ష్మి, పీఆర్‌టీయూ అధ్యక్షులు సోమలింగం గౌడ్, సల్మాన్ ఖాన్ తదితరులున్నారు.

దివ్యాంగులకు ఇచ్చిన హామీని అమలు చేయాలి

● బోధన్ సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట దివ్యాంగుల ధర్నా



ధర్నాలో పాల్గొన్న దివ్యాంగులు

బోధన్‌రూరల్,నవంబరు30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఎన్నికలలో వికలాంగులకు ఇచ్చిన హామీని అమలు చేయాలని, వికలాంగులకు రూ.6వేల పింఛన్ మంజూరు చేయాలని ధర్నా నిర్వహిస్తూ శనివారం బోధన్ సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఆధ్వర్యంలో ఒకరోజు రిలే దీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సహాయ కార్యదర్శి ఏశాల గంగాధర్ మాట్లాడుతూ ప్రభుత్వం వికలాంగులకు 6వేల రూపాయల పింఛన్, బీడీ కార్మికులకు, వృద్ధులకు, వితంతువులకు 4వేల రూపాలయ పింఛన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి నెల 5వ తేది లోపు పింఛన్‌లు అమలు చేయాలన్నారు. అర్హులైన వారందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు మంజూరు చేయాలన్నారు. వికలాంగులకు 5శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. 9వ తేదిన హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద నిర్వహించనున్న ధర్నా కార్యక్రమానికి అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వికలాంగులు తదితరులు పాల్గొన్నారు.

పట్టణాల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్

బోధన్‌రూరల్,నవంబరు30(ఆంధ్రజ్యోతి): పట్టణాల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని బోధన్ పట్టణంలోని అన్ని వార్డులను పార్టీలకు అతీతంగా ఎమ్మెల్యే సహకారంతో అభివృద్ధి జరుగుతుందని బోధన్ మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మ శరత్ రెడ్డి అన్నారు. శనివారం బోధన్ పట్టణంలోని మున్సిపల్ సమావేశం మందిరంలో సాధారణ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా పది ఏజెండా అంశాలను కౌన్సిల్‌సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు 58లక్షలు మంజూరయ్యాయన్నారు.బోధన్‌లో పార్టీలకు అతీతంగా అన్ని వార్డులను అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. నేటి నుంచి ప్రజాపాలన విజయోత్సవ కార్యక్రమాలు నిర్వహించబడతాయన్నారు.1వ తేదీ నుంచి 9వ తేది వరకు ప్రజాపాలన విజయోత్సవాలు నిర్వహించబడతాయని పేర్కొన్నారు.ప్రజాపాలన విజయోత్సవాలలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. న్నారు. లేనియెడల శాఖపరమైన చర్యలుతప్పవన్నారు.

బోధన్ కోర్టులో 14న మెగా లోక్ అదాలత్

బోధన్‌రూరల్,నవంబరు30(ఆంధ్రజ్యోతి): బోధన్ కోర్టులో ఈ నెల 14వ తేదీన మెగా లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించబడుతుందని జిల్లా అడిషనల్ న్యాయాధికారి ఎస్.రవికుమార్ అన్నారు. శనివారం బోధన్ కోర్టులో అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజీమార్గమే రాజీ మార్గమని ప్రజలు కోర్టుల చుట్టు తిరగకుండా సమస్యలు పరిష్కరించుకోవాలని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. 14న నిర్వహించే మెగా లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగపర్చుకునేలా అధికారులు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు అజయ్‌కుమార్, సాయిశివ, డివిజన్ స్థాయి పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బైక్‌లు అపహరిస్తున్న వ్యక్తిని గుర్తించండి

ఖిల్లా, నవంబరు30(ఆంధ్రజ్యోతి):నగరంలోని పలు పోలీసు స్టేషన్లలో ద్విచక్రవాహనాలను అపహరిస్తున్న వ్యక్తిని ప్రజలు గుర్తించాలని ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల ఒకటో టౌన్ పరిధిలో బైక్‌ను అపహరిస్తున్న వ్యక్తిని సీసీఫుటేజీల్లో గుర్తించినట్లు తెలిపారు. ఈ వ్యక్తిని గుర్తించిన వారు నేరుగా 8712659837నంబరుకు సంప్రదించాలని కోరారు.

మొరం టిప్పర్ స్వాధీనం

ఖిల్లా, నవంబరు30(ఆంధ్రజ్యోతి):నగరంలోని రెండో టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో అనుమతులు లేకుండా అక్రమంగా మొరంను తరలిస్తున్న టిప్పర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు రెండవ ఎస్ఐ యాసిన్‌అరాఫత్ తెలిపారు. శుక్రవారం రాత్రి వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానస్పదంగా వెళ్తున్న టిప్పర్‌ను ఆపి తనిఖీ చేయగా మొరంకు సంబంధించిన ఎటువంటి పత్రాలు లేకపోవడంతో ఆ టిప్పర్‌ను స్వాధీనం చేసుకుని కేసునమోదుకు సంబంధిత మైన్స్ శాఖాధికారులకు అప్పగించినట్లు తెలిపారు.

ఆహార పదార్థాలలో కల్తీ నివారణపై అవగాహన

కోటగిరి,నవంబరు30(ఆంధ్రజ్యోతి): రుద్రూరు మండల కేంద్రంలోని కృషి విజ్ఞాన కేంద్రం ఫుడ్ టెక్నాలజీ కళాశాలలో శనివారం ఆహార కల్తీ నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి మాట్లాడుతూ ఆహార కల్తీ పట్ల వినియోగదారులు చైతన్యం కావాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సీసీఐ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు సుదర్శన్, శాస్త్రవేత్తలు అంజయ్య, అసోసియేట్ డీన్ కల్పన, అనిల్ కుమార్, వర్మ, ప్రవీణ్, రత్నాకర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హత్యకేసును ఛేదించిన ఒకటో టౌన్ పోలీసులు

● ఇద్దరు వ్యక్తుల అరెస్టు

ఖిల్లా, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఒకటో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన హత్యకేసులో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు. జిల్లా కేంద్రంలోని సంతోష్‌నగర్‌కు చెందిన వాస్తర్ రాజేష్ (51) ముస్తాయిద్‌పుర చౌరస్తా వద్ద అనుమానాస్పదంగా మృతిచెంది ఉండగా స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టినపోలీసులు శనివారం ఇద్దరు వ్యక్తులైన గురుద్వార గాజుల్‌పేట్‌కుచెందిన రాజు రాంజీ భీమల్‌వాడి, నిజాంకాలనీకి చెందిన షేక్ సికందర్ లను అదుపులోకి తీసుకొని విచారించగా నేరం అంగీకరించినట్లు తెలిపారు. వీరు ముగ్గురు కలిసి ఈనెల 25న మద్యంతాగారు. మద్యం మత్తులో ఉన్న వీరు ముగ్గురు గొడవపడగా మృతుడిని తోసివేశారు. ఈ ఘటనలో తలకు తీవ్రమైన గాయాలు కావడంతో రాజేష్ మృతిచెందాడు. నేరం అంగీకరించడంతో వీరిద్దరిపై హత్యకేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల బంద్ విజయవంతం


ధర్మారం లో విద్యార్థులను బంద్ పాటిస్తున్న నాయకులు

● బంద్ సందర్భంగా అరెస్టులు చేయడం సిగ్గుచేటు

నిజామాబాద్ అర్బన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఫుడ్ పాయిజన్ ఘటనలపై రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యంపై నిరసనగా ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పిడిఎస్‌యు, ఏఐపిఎస్‌లు ఆధ్వర్యంలో శనివారం జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల బంద్ విజయవంతమైంది. ఈ సందర్భంగా ఎస్ ఎఫ్ ఐ, పిడిఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శులు విఘ్నేష్, గణేష్‌లు మాట్లాడుతూ రాష్టంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 11 నెలల్లో కల్తీ ఆహారం, ఫుడ్ పాయిజన్, పాముకాటుతో విద్యార్థుల మరణం, మధ్యా హ్న భోజనంలో పురుగులు తదితర ఘటనలు తరచుగా జరుగుతున్నా యని దీనికి ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడమే కారణమన్నారు. విద్యాశాఖకు మంత్రి లేకపోవడం సిగ్గుచేటని వెంటనే విద్యాశాఖ మంత్రిని నియమించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పేద మధ్య తరగతి విద్యార్థులే చదువుతున్నారని వారి విషయంలో నిర్లక్ష్యం వీడాలన్నారు. జిల్లా వ్యాప్తంగా బంద్‌కు పిలుపునిస్తే విద్యార్థి సంఘాల నాయకులను అరెస్టులు చేయడం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రఘురాం, పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్, ఏఐపిఎస్‌యు కార్యదర్శి అనిల్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షురాలు దీపిక తదితరులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి: రాష్ట్ర వ్యాప్తంగా ఫుడ్‌పాయిజన్ కారణంగా వందలాది మంది విద్యార్థులు ఆసుపత్రి పాలైతే పదుల సంఖ్యలో విద్యార్థులు మరణిస్తే ఎలాంటి స్పందన లేని ప్రభుత్వానికి నిరసనగా వామపక్ష విద్యార్థి సంఘాల పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో శనివారం జక్రాన్‌పల్లిలో పాఠశాలలను బంద్ చేయించారు. పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు అనిల్ కుమార్ ఆధ్వర్యంలో పాఠశాలలను బంద్ చేయించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పటిష్టంగా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు అరుణ్, శ్రీకాంత్, సింహాద్రి, తదితరులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి: రాష్ట్రంలో వరుసగా ఫుడ్ పాయిజన్ ఘటనలు జరుగుతున్న నపథ్యంలో ప్రభుత్వ వైఖరి నిరసనగా వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ధర్మారం గ్రామ ప్రభుత్వ పాఠశాలను పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో బంద్ నిర్వహించారు. పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాడిన నుంచి 51మంది విద్యార్థులు మరిణించారని గురుకుల, కేజీబీవీ, ఆశ్రమ పాఠశాలు, ప్రభుత్వ పాఠశాలలో తరుచు ఫుడ్ పాయిజన్ ఘటనలు జరుగుతున్నాయని ఆయన అన్నారు. సంబంధిత అధికారులు నిత్యం పర్యవేక్షించాలని విద్యాశాఖమంత్రి ని నియామించకపోవడం సరికాదని, చనిపోయిన కుటుంబాలకు ఎక్స్‌గ్రేసియ కల్పించి కుటుంబంలో ఒకరి ప్రభుత్వ ఉద్యోగం కల్పించలన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా నాయకురాలు దేవిక, కిరన్ పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలల బంద్ విజయవంతమైందని ఏఐపీఎస్‌యు, పీడీఎస్‌యు, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘాల నాయకులు అన్నారు. రాష్టంలో ఫుడ్‌పాయిజన్‌తో విద్యార్థులు చనిపోతున్నారని, గురుకుల, కేజీబీవీ ఆశ్రమ పాఠశాలతో పాటు ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన పోషకాహారం అందించడంలేదని, సంబంధిత విద్యాశాఖ అధికారులు నిత్యం పర్యవేక్షించాలని వారు డిమాండ్ చేశారు. తక్షణమే విద్యాశాఖ మంత్రిని నియమించాలని, చనిపోయిన విద్యార్థులకు ఎక్స్‌గ్రేషియా ప్రకటించి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యు, ఏఐపీఎస్‌యు, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఆస్పత్రి ఎదుట పీవైఎల్ నిరసన

డిచ్‌పల్లి, నవంబరు30 డిచ్‌పల్లి ప్రభుత్వ మూపై పడకల ఆస్పత్రిలో రోగులకు కావాల్సిన సౌకర్యాలు ఆస్పత్రిలో వైద్యం కోసం వచ్చిన ప్రజలకు పాము, కాటు మందులు అందు బాటులో ఉంచకపోవడం బాధకరమని పీవైఎల్, పీవోడబ్ల్యూ నాయకులు ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట శనివారం నిరసన వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో పీవోడబ్ల్యూనాయకులు లలిత, అమూల్య, పీవైఎల్ నాయకుడు మహేశ్, మురళిశ్రీని వాస్, పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

కోటగిరి,నవంబరు30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల ఇన్‌చార్జి సవిత రాణి డిమాండ్ చేశారు. కోటగిరి కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల ఎదుట శనివారం ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఐసీ కోఆర్డినేటర్ ఈశ్వంత్ రావు, కంప్యూటర్ ఆపరేటర్ భూపేందర్, సీఆర్‌టీలు రూప, అపర్ణ, మస్రత్, పద్మ, సీఆర్‌పీలు సుధాకర్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

నవీపేట: మండలంలోని మోకన్‌పల్లి కస్తూర్బా బాలికల పాఠశాల ఎదుట శనివారం ఉద్యోగులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం పిలుపు మేరకు తమ ఉద్యోగాలను రెగ్యులర్ చేయాలని కోరుతూ భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ పాఠశాల ప్రత్యేక అధికారిణి కవిత, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది ఉన్నారు.

వీఆర్‌వోలను తిరిగి రెవెన్యూలోకి తీసుకోవాలి

కామారెడ్డి టౌన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): వీఆర్‌ఓలను తిరిగి రెవెన్యూలోకి తీసుకోవాలని పూర్వ వీఆర్‌ఓల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శాంతయ్య అన్నారు. ఉద్యోగభద్రత, వీఆర్‌వోల ఆత్మగౌరవం కోసం ఆదివారం మేడ్చల్ జిల్లా షామీర్‌పేట్ మండలం తూంకుంటలో జరిగే ఆందోళన సభను పూర్వ వీఆర్‌ఓలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. గత ప్రభుత్వం తీసుకువచ్చిన జీవోఎంఎస్ 29ద్వారా వీఆర్‌ఓ వ్యవస్థ రద్దుచేయబడిందని నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ శాఖలలోకి అటనమస్‌బాడిస్‌లోకి బలవంతపు సర్దుచేయడంతో ఉద్యోగుల హక్కులు, మానవహక్కులు కోల్పొయామని అన్నారు. గత ప్రభుత్వ అశాస్త్రీయమైన విధానాల వల్ల ఒక మహిళ తహసీల్దార్ హత్యకు గురయ్యారని, మరో 178 మంది వీఆర్‌ఓలు మృతిచెందారని అన్నారు.అటెండర్‌గా, స్వీపర్‌గా, వంట కుక్‌గా, రికార్డు కీపర్‌గామహిళ జీప్ డ్రైవర్‌గా, సీనియర్ అసిస్టెంట్‌గా, సూపరింటెండెంట్‌గా బలవంతంగా సర్దుబాటు చేశారని అన్నారు. 5139 మంది వీఆర్‌ఓలను ఎటు వంటి షరతులు లేకుండా రెవెన్యూశాఖలో తిరిగి తీసుకోవాలని, పే ప్రోటక్షన్ సర్వీస్ ప్రోటక్షన్ కల్పించాలని,వీఆర్‌ఓ,వీఆర్‌ఏలను తిరిగి ఆప్షన్ పద్ధతిలో రెవెన్యూశాఖలోకి సర్దుబాటు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

ఉపాధ్యాయురాలికి సన్మానం

దోమకొండ, (బీబీపేట) నవంబరు 30 (ఆంధ్రజ్యోతి):బీబీపేట మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో స్థానిక బాలికల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు మేఘవర్ణను శనివారం ఎంపీడీవో పూర్ణచంద్రోదయ కుమార్ శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలోని నిరుపేదలకు చేస్తున్న నిస్వార్థ సేవలకు గుర్తింపుగా సన్మానించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో నాంపల్లి, పంచాయతీ కార్యదర్శి రమేష్, హెచ్. ఎం రామేశ్వర్‌రెడ్డి, కారోబార్ సిద్ధరాములు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి ఉత్సవాలు

జక్రాన్‌పల్లి, నవంబరు30(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొర్లికొండ గ్రామంలో గల శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో శనివారం ఉత్సవా లను భక్తులు, గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో జరిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, వీడీసీసభ్యులు, భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

కామారెడ్డిటౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి మండలంలోని గర్గుల్ జడ్పీహెచ్ఎస్‌ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి హాకి పోటిలకు ఎంపికైనట్లు పీడీ నోముల మధుసూదన్‌రెడ్డి తెలిపారు. సతీష్,స్టివెన్, వర్షిత్, కృష్ణలక్ష్మన్, వీణ, నక్షత్రలు కరీంనగర్ జిల్లాలోని హుజురాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి క్రీడలలో పాల్గొంటారని తెలిపారు.

విద్యార్థుల సమస్యలపై అదనపు కలెక్టర్‌కు వినతి

కామారెడ్డిటౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పాలనలో విద్యార్థులు దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటున్నారని ఏబీవీపీ హస్టల్ జిల్లా కన్వీనర్ ఖలీల్ అన్నారు. శనివారం అదనపు కలెక్టర్ విక్టర్‌కు విద్యార్థుల సమస్యలపై ఏబీవీపీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన సంవత్సర కాలంలో 51 మంది విద్యార్థులను బలితీసుకుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి సం తోష్, ఎస్ఎఫ్ఎస్ ఇంచార్జ్ అల్తాఫ్,మోహన్,శశి,ధన్‌రాజ్,శివ తదితరులుపాల్గొన్నారు.


అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం జేస్తున్న దృశ్యం

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి


● ముగ్గురు ఉపాధ్యాయులకు నోటీసులు


ప్రార్థన సమయంలో పాల్గొన్న ఎంఈవో

బోధన్‌రూరల్, నవంబరు30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు తమ విధులకు సమయపాలన పాటించాలని బోధన్ మండల విద్యాశాఖ అధికారి నాగయ్య అన్నారు. శనివారం బోధన్ మండలంలోని కొప్పర్గ ఉర్దూ మీడియం పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉదయం పాఠశాల ప్రార్థన సమయానికి హాజరు కాని ముగ్గురు ఉపాధ్యాయులకు వివరణ ఇవ్వాలని నోటీసులు జారీ చేశారు. పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఖాజామొహిన్, రహీమొద్దీన్, హతికుద్దీన్‌లు పాఠశాలకు ఆలస్యంగా వచ్చారని పేర్కొన్నారు. ఇక నుంచి ప్రతీరోజు బోధన్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేయడం జరుగుతుందన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలన్నారు.

సీఎంపై విమర్శలు మానుకో

● మాజీఎమ్మెల్యే జీవన్‌రెడ్డిని హెచ్చరించిన వినయ్‌రెడ్డి


మాట్లాడుతున్న ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ

ఆర్మూర్‌రూరల్, నవంబరు30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కాంగ్రెస్ నాయకులపై విమర్శలు మానుకోవాలని మాజీఎమ్మెల్యే జీవన్‌రెడ్డికి ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ వినయ్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం పట్టణంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డితో పాటు పీసీసీ అధ్యక్షుడు, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, రాష్ట్ర చైర్మన్‌లు ఈరవత్రి అనిల్, మానాల మోహన్‌రెడ్డిలపై మాజీఎమ్మెల్యే అనుచిత వ్యాఖ్యాలు చేయడం పట్ల వినయ్‌రెడ్డి మండిపడ్డారు. ఈ సమావేశంలో ఆర్మూర్ పట్టణ అధ్యక్షుడు సాయిబాబా గౌడ్, వైస్‌చైర్మన్ శేక్ మున్ను, కౌన్సిలర్‌లు ఆకుల రాము, లిక్కి శంకర్, ఇంతియాజ్, పండిత్ పవన్, కొంతం మురళీ, కాంగ్రెస్ పార్టీ మండలాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

రెండు ద్విచక్ర వాహనాల ఢీ.. ఒకరి మృతి

కోటగిరి,నవంబరు30(ఆంధ్రజ్యోతి): పొతంగల్ మండలం కల్లూర్ వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సాయిలు(48)అనే వ్యక్తి మృతి చెందారు. ఎస్ఐ సందీప్ తెలిపిన వివరాల ప్రకారం బిచ్కుంద మండలం వాజీద్ నగర్‌కు చెందిన సాయిలు సాలూర మండలంలోని హన్స గ్రామానికి వెళ్లి తిరిగి వస్తున్నాడు. బీర్కూర్ మండలంలోని బరంగేడ్గి గ్రామానికి చెందిన మరొకరు ద్విచక్ర వాహనంపై పొతంగల్ వైపు వస్తుండగా కల్లూర్ వద్ద ఎదురెదురుగా వచ్చిన రెండు బైక్‌లు ఢీకొన్నాయి.బరండేడ్గికి చెందిన మరో వ్యక్తికి తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆచన్‌పల్లిలో చోరీ

బోధన్‌రూరల్,నవంబరు30(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని ఆచన్‌పల్లిలో శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని ఒంటరిగా ఉన్న మహిళ ఇంట్లో చొరబడి 5తులాల బంగారంతో పాటు 40తులాల వెండి దొంగలించినట్లు బాధితులు తెలిపారు. ఒంటరిగా ఉన్న మహిళను టార్గెట్ చేస్తూ దొంగతనాలు జరుగుతున్నాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేపడుతున్నామన్నారు. సీసీ పుటేజీల ద్వారా త్వరలోనే దొంగలను పట్టుకున్నామని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య

బోధన్‌రూరల్,నవంబరు30(ఆంధ్రజ్యోతి): సాలూర మండలంలోని మందర్నా గ్రామానికి చెందిన రాహుల్(26)అనే వ్యక్తి శనివారం తెల్లవారుజామున గ్రామ శివారులోని చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు బోధన్ రూరల్ ఎస్ఐ మచ్చేందర్ రెడ్డి తెలిపారు. మృతుడి భార్య కల్పన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. ఆత్మహత్యకు గల కారణాలను అన్ని కోణాల్లో విచారణ చేపడుతున్నామన్నారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు.



ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులన్నీ పెండింగ్‌లోనే..!

» మందకొడిగా ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల అనుమతులు » ఎల్‌ఆర్‌ఎస్ కోసం వచ్చిన దరఖాస్తులు 33,814 » అనుమతి ఇచ్చినవి కేవలం 1500 మాత్రమే

» శాఖల మధ్య సమన్వయలోపంతో అనుమతుల్లో జాప్యం » 2016 నుంచి అనుమతుల కోసం వేచిచూస్తున్న దరఖాస్తుదారులు

» నగర పాలక సంస్థ చుట్టూ తిరుగుతున్నా పరిష్కారం కాని వైనం » సర్వర్ సమస్యతో ఆగుతున్న దరఖాస్తులు

సుభాష్‌నగర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన అనంతరం అప్పటి ప్రభుత్వం ప్లాట్లను క్రమబద్ధీకరించేందుకు ఎల్‌ఆర్‌ఎస్ పథకాన్ని ప్రవేశపెట్టింది. 2016లో ప్లాట్ల క్రమబద్ధీకరణ కోసం వెయ్యి రూపాయల రుసుముతో ఎల్‌ఆర్‌ఎస్ పథకాన్ని ప్రవేశపెట్టి ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించింది. గ్రామస్థాయి నుంచి నగరపాలక సంస్థ వరకు ప్లాట్లను క్రమబద్ధీకరించేందుకు ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. దీంతో దర ఖాస్తుదారులు ప్లాట్లను క్రమబద్ధీకరించేందుకు కార్యాలయాల వద్ద క్యూకట్టారు. గ్రామ పంచాయతీ నుంచి మొదలుకొని నగరపాలక సంస్థ వరకు ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు కుప్పలుతెప్పలుగా వచ్చిపడ్డాయి. దీంతో మున్సిపల్, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలతో కలిసి సమన్వయంతో ఎల్‌ఆర్‌ఎస్ అనుమతినిచ్చేందుకు శ్రీకారం చుట్టింది. 2016 నుంచి మొదలైన ఈ ఎల్‌ఆర్‌ఎస్ పథకం అనుమతులు ఇవ్వడంలో మాత్రం నత్తతో పోటీపడుతోంది. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్‌పై దృష్టిసారించి అనుమతులు ఇచ్చేందుకు మరోసారి అవకాశం కల్పించింది. అయినా అధికారుల నిర్లక్ష్యం తో ఎల్‌ఆర్‌ఎస్ పథకం అమలుకు నోచుకోవడం లేదు. 2016 నుంచి మొదలుకొని ఇప్పటి వరకు ధరఖాస్తులు కుప్పతెలుప్పగా కార్యాలయాల్లో పడి ఉన్నాయి. కొన్నింటిని ఆన్‌లైన్ చేయడంలోనూ అలసత్వం ప్రదర్శించడంతో దరఖాస్తుదారులు తమ దరఖాస్తు పరిస్థితి ఏంటని ఇప్పటికీ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. కొందరు వెయ్యి రూపాయల నుంచి మొదలుకొని పది వేల రూపాయల వరకు చెల్లించినప్పటికీ అనుమతులు రాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. అప్పటి అధికారులు సైతం బదిలీలు కావడంతో ప్రస్తుతం ఉన్న అధికారులు ఆ దరఖాస్తు గురించి తమకు తెలియదన్నట్లు వ్యవహరించడంతో తమ పరిస్థితి ఏంటని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దరఖాస్తుదారులు వేల సంఖ్యలో ఉంటే అనుమతులు ఇచ్చినవి మాత్రం వందల సంఖ్యలో ఉండడం ఎల్‌ఆర్ ఎస్ పథకంపై నిర్లక్ష్యం స్పష్టంగా కన్పిస్తోంది.

33,814 దరఖాస్తులు.. 1500 అనుమతులు

నిజామాబాద్ నగర పాలక సంస్థలో ఎల్‌ఆర్‌ఎస్ అనుమతుల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. నగరపాలక సంస్థలో 2016 నుంచి మొత్తం దరఖాస్తులు 33వేల 814 నమోదు కాగా వాటిలో కేవలం 1500 అర్జీలకే అనుమతులు ఇచ్చారు. సుమారు ఎనిమిదేళ్ల కాలంలో 1500 మాత్రం దరఖాస్తులు అనుమతులు ఇచ్చారంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. అనుమతుల కోసం ప్రత్యేకంగా అధికారులను నియమించినా అనుమతులు మాత్రం చకచకా జరగడం లేదు. అనుమతుల కోసం అధికారులు కొర్రీలు పెడుతున్నారని దరఖాస్తు దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎనిమిది సంవత్సరాలలో 1500 దరఖాస్తులు అనుమతులు ఇస్తే 33వేలకు పైగా దరఖాస్తుల అనుమతులు ఇవ్వడానికి ఇంకా ఎన్ని సంవత్సరాలు పడతాయోనని దరఖాస్తు దారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 2016 తర్వాత దరఖాస్తు చేసుకున్న వారు ఇప్పటివరకు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. అప్పటి అధికారులు బదిలీలై ఇతర చోట్లకు వెళ్లడంతో ప్రస్తుతం ఉన్న అధికారులు ఆ దరఖాస్తులపై తమకేమీ తెలియదన్నట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో దరఖాస్తు దారులు ఈ సమస్యపై ఎవరిని కలవాలో అర్థం కాని పరిస్థితి నెలకొంది. దరఖాస్తుల కోసం వెయ్యి రూపాయల నుంచి మొదలుకొని రూ.10 వేల వరకు చెల్లించినా ఫలితం లేకుండా పోయిందని దరఖాస్తు దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

శాఖల మధ్య సమన్వయలోపం

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను పరిశీలించడానికి మూడు శాఖలను సమన్వయం చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మున్సిపల్ పరిధిలో మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు, రెవెన్యూ అధికారులు, ఇరిగేషన్ శాఖ అధికారులతో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల అనుమతులు ఇవ్వడానికి లాగిన్‌లను అందించింది. ఎల్-1 లాగిన్ మున్సిపల్ శాఖది కాగా, ఎల్-2 రెవెన్యూశాఖది, ఎల్-3 ఇరిగేషన్ శాఖది. ఈ మూడు లాగిన్‌లు ఒకే అయితేనే అనుమతి లభిస్తుంది. ఈ మూడుశాఖల మధ్య సమన్వయం కొరవడడంతో దరఖాస్తులు పెండింగ్‌లో ఉంటున్నాయి. మున్సిపల్ శాఖ అధికారులు తమ పనిని కొంతమేర కానిస్తున్నా ఇతర శాఖల నుంచి అలసత్వం ప్రదర్శించడంతో దరఖాస్తులు అనుమతులు ఇవ్వడంలో జాప్యం జరుగుతుంది. మూడు శాఖలు ఒకరివల్ల అంటే ఒకరివల్ల అని దరఖాస్తులు మాత్రం పట్టించుకోవడం లేదు. మున్సిపల్ శాఖ అధికారులు ఎల్‌ఆర్‌ఎస్ కోసం సుమారు 32మంది అధికారులను కేటాయి ంచింది. ఇందులో టౌన్ ప్లానింగ్ నుంచి ముగ్గురు అధికారుల ను, జూనియర్ అసిస్టెంట్లను ఐదుగురిని కేటాయించింది. వీరితో పాటు వార్డు అధికారులను 26మందిని కేటాయించి రెవెన్యూ కలెక్షన్‌ల అనంతరం వారికి ఎల్‌ఆర్‌ఎస్ టార్గెట్‌ను విధించింది. రెవెన్యూ శాఖ నుంచి ఐదుగురిని, ఇరిగేషన్ శాఖ నుంచి నలుగురిని కేటాయించింది. వీరికి రోజుకు ఇరవై నుంచి ముప్పై చొప్పున టార్గెట్ విధించిన ఎల్‌ఆర్‌ఎస్ అనుమతుల ప్రక్రియ ముందుకు సాగడం లేదు. ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియను ముగించాలని చెప్తున్నా శాఖల మధ్య సమన్వయ లోపంతో పెండింగ్‌లో ఉంటుంది.



షార్ట్ ఫాల్స్, సర్వర్ సమస్యతో అనేక ఇబ్బందులు

అప్పటి తెలంగాణ ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ ధరఖాస్తుల కోసం ఎలా ంటి డాక్యుమెంట్‌లను అడగకుండా నే ధరఖాస్తులను స్వీకరించింది. ప్రస్తుతం దరఖాస్తుతో ఎలాంటి డాక్యుమెంట్లను అందజేయకపోవడంతో దరఖాస్తులు పెండింగ్‌లో ఉంటున్నాయి. ప్రస్తుతం అనుమతుల కోసం ఆన్‌లైన్‌లో ఈసీ, మార్కెట్ వాల్యూ, లింక్ డాక్యుమెంట్, వెంచర్‌మ్యాప్ అడుగుతోంది. ఇవేమీ దరఖాస్తుతో పాటు జతపర్చకపోవడంతో ధరఖాస్తు సబ్మిట్ కావడం లేదు. దీంతో మళ్లీ ఈ డాక్యుమెంట్లు అన్నింటినీ జతపర్చాల్సి వస్తోంది. దీంతో పాటు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల నమోదు చేయడానికి సర్వర్ సమస్యతో అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. గత కొన్ని రోజులుగా సర్వర్ మొరాయించడంతో ధరఖాస్తుల నమోదు ప్రక్రియ సరిగ్గాసాగడం లేదు. ఒక్కొక్క రోజైతే ఉదయం నుంచి సాయంత్రం వరకు సర్వర్ సమస్యతో అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. ఒక్క ధరఖాస్తు నమోదు కోసం ఎక్కువ సమయాన్ని కేటాయించాల్సి వస్తుందని అధికారులు చెప్తున్నారు.

ఆంధ్రజ్యోతి ఫోకస్

2016 నుంచి కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా..

● నరేష్ కుమార్, జండాగల్లి



వినాయక్‌నగర్‌లో గల ప్లాట్ క్రమబద్ధీకరణ కోసం 2016లో దరఖాస్తు చేసుకున్నాను. 2016 నుంచి నగరపాలక సంస్థ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా. ఇప్పటికీ నా దరఖాస్తుకు అనుమతి లభించలేదు. ప్రస్తుతం ఉన్న అధికారులను అడిగితే అప్పటి అధికారులకే తెలుసని చెబుతున్నారు. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తు కోసం డబ్బులు కూడా చెల్లించాను. ఇప్పటిదాకా ఎలాంటి మెస్సేజ్ రాలేదు. అధికారుల నుంచి కూడా ఎలాంటి పిలుపురాలేదు. ఇప్పటికైనా మున్సిపల్ ఉన్నతాధికారులు ధరఖాస్తును పరిష్కరించాలి.

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నాం..

● సత్యనారాయణ, టీపీవో

నగర పాలక సంస్థలో ఎల్‌ఆర్‌ఎస్ కోసం వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నాం. వీటికోసం ప్రత్యేకంగా అధికారులను కేటాయించి పరిశీలన కోసం నియమించాం. ఎల్‌ఆర్‌ఎస్ సమస్యల కోసం ప్రత్యేక హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేశాం. సమస్యలు ఉన్నవారు 9700918886 నెంబర్‌ను సంప్రదించాలి.



మాట్లాడుతున్న మొదటి అదనపు జిల్లా న్యాయాధికారి కనకదుర్గ

బాలలపై లైంగిక హింసను నిరోధిద్దాం

నిజామాబాద్ లీగల్, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): బాలలపై పెరుగుతున్న అన్నిరకాల హింస, లైంగిక దాడులను నిరోధించాల్సిన గురుతర బాధ్యత పౌర సమాజంపై ఉందని నిజామాబాద్ జిల్లా పోక్సో కోర్టు న్యాయమూర్తి, అదనపు జిల్లా జడ్జి కనకదుర్గ అన్నారు. శనివారం జిల్లా కోర్టు ప్రాంగణంలోని ఆమె ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పోక్సో చట్టం విశిష్టతను వివరించారు. లైంగిక నేరాల నుండి పిల్లల రక్షణ చట్టం -2012ను చిన్నగా పోక్సో చట్టంగా పిలవడం జరుగుతుందని పోక్సో చట్టం ప్రకారం ప్రత్యేక పోక్సో కోర్టులు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. 18 సంవత్సరాలలోపు బాల బాలికలపై జరిగిన లైంగిక దాడులను విచారిస్తాయని అన్నారు. గతంలో అమ్మాయిలకు చట్టపరమైన రక్షణ తక్కువగా ఉండేదని పోక్సో చట్టం అమలుతో వారికి చట్టపరమైన రక్షణ పెరిగిందని అన్నారు. పోక్సో చట్టం ద్వారా మగ పిల్లలకే శిక్షలు పడుతున్నాయని పేర్కొన్నారు. అమ్మాయి అయిన అబ్బాయి అయిన ప్రేమ అనే ఊబిలో చిక్కుకోరాదని కోరారు. ఇంటర్నెట్, పోర్నోగ్రాఫీ ప్రభావం వలన పిల్లలపై దుష్ప్రభావాలు పడుతున్నాయని అన్నారు. అక్రమ సంబంధాలు, కులాల మధ్య అంతరాల వలన పిల్లలపై ప్రభావం చూపి పోక్సో కేసులు పెరగడానికి ఒక కారణమవుతున్నాయని ఆమే పేర్కొన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు, బార్ సభ్యులు పాల్గొన్నారు.

హిందూ ధర్మం గొప్పది

● స్వర్ణ కమల లక్ష్మి

రెంజల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): అన్ని ధర్మల్లోకెల్లా హిందూ ధర్మం గొప్పదని శ్రీశ్రీ స్వర్ణ కమల లక్ష్మి అమ్మవారు అన్నారు. శనివారం సామాజిక సామరసత ఇందూరు జిల్లా ఆధ్వర్యంలో కార్తీక మాసం చివరి శనివారాన్ని పురస్కరించుకుని కందకుర్తి గోదారమ్మకు మహా హారతి కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన శ్రీశ్రీ స్వర్ణ కమల లక్ష్మి, సామాజిక సామరసత రాష్ట్ర కన్వీనర్ అప్పాల ప్రసాద్, శ్రీశ్రీశ్రీ సీతారాం త్యాగి గోదారమ్మకు మహా హారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిందూ ధర్మ అత్యంత పవిత్రమైందని దేశంలోని అంటరాని తనం, కుల వివక్ష నిర్మూలన కోసం సంకల్పం తీసుకుని ఆశ్రమాల ద్వారా పని చేయాలని సూచించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సాధుసంతువులకు సామరసత వేదిక ముఖ్య ఉద్దేశాలను వివరించారు. కుల రహిత సమాజాన్ని నిర్మించాలని, అందరూ సమానంగా జీవించాలని స్వామిజీలు సూచించారు. అనంతరం గంగమ్మకు మహా హారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సృజన్ రెడ్డి, గంగా నర్సయ్య, రమేష్, గజానన్, విజయ్, సురేష్, సతీష్, శైలేష్, గంగాధర్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



గోదావరికి హారతి ఇస్తున్న స్వామిజీలు

అభివృద్ధిపై చర్చకు మేము సిద్ధం

● జీవన్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి తోడు దొంగలు ● కేటీఆర్, హరీష్‌రావులు వచ్చినా చర్చకు రెడీ: కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి

నిజామాబాద్‌అర్బన్, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): గత కొన్నిరోజులుగా జిల్లాలో బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వంపై చేస్తున్న అబద్ధపు ఆరోపణలు మానుకోవాలని గత ఏడాదిగా జరుగుతున్న అభివృద్ధి గతంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి పదేళ్ల బీఆర్ఎస్ అభివృద్ధిపై తాము చర్చకు సిద్ధం అని జిల్లాకు చెందిన జీవన్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డిలు, బిల్లా రంగాలు కేటీఆర్, హరీష్‌రావులు ఎవరొచ్చినా సమయం, స్థలం వారే నిర్ణయించాలని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి సవాల్ విసిరారు. జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత కొన్ని రోజులుగా బీఆర్ఎస్ మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వంపై లేని పోని ఆరోపణలు చేస్తున్నారని, అబద్ధాలు మాట్లాడితే నిజం కావని అన్నారు. ఏడాది కాలంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ వస్తోందని అన్నారు. గ్రామాల్లో తిరుగుతూ కాంగ్రెస్ ప్రభుత్వం బోనస్ వేయాలని చెప్పిన బీఆర్ఎస్ నాయకుల తప్పుడు మాటలతో రైతులు భయంతో ధాన్యాన్ని ప్రైవేటు వ్యక్తులకు అమ్ముకున్నారని ఇప్పుడు ప్రభుత్వం బోనస్ ఇస్తున్న సందర్భంలో బీఆర్ఎస్ నేతలు మొఖం చాటేశారని అన్నారు. బిఆర్ఎస్ పదేళ్ల పాలనలో అన్ని వర్గాలను నిర్లక్ష్యం చేసిందని కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిలోనే సీఎం రేవంత్‌రెడ్డి అప్పుల పాలైన రాష్ట్రాన్ని క్రమ క్రమంగా అభివృద్ధి పథంలోకి తీసుకువస్తూ ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నారని అన్నారు. త్వరలోనే మిగిలిన అన్ని హామీలను కూడా నెరవేరుస్తామని ఆయన అన్నారు. బీఆర్ఎస్ నాయకులు గత పది సంవత్సరాల్లో చేసిన అభివృద్ధిపై చర్చకు రావాలని, కాంగ్రెస్ పది నెలల్లో చేసిన అభివృద్ధిపై మేము చర్చకు సిద్ధంగా ఉన్నామని ఆయన అన్నారు. రాష్ట్రస్థాయిలో బిఆర్ఎస్ నుంచి కేటీఆర్, హరీష్‌రావులు వచ్చిన జిల్లాలో తోడు దొంగలు ప్రశాంత్‌రెడ్డి, జీవన్‌రెడ్డిలు వచ్చిన తాము రెడీ అని ఈ సవాల్‌ను స్వీకరించే దమ్ము బీఆర్ఎస్ నేతలకు ఉందా అని ప్రశ్నించారు. పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌పై జీవన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఆయన స్థాయికి తగినవి కావని జిల్లాలో సెటిల్‌మెంట్లు, దందాలు, బ్రోకరిజం చేసింది ఎవరో ప్రజలందరికి తెలుసన్నారు. సమావేశంలో గ్రంథాలయ చైర్మన్ అంతరెడ్డి రాజారెడ్డి, రత్నాకర్, ప్రచార కమిటీ మెంబర్ జావిద్ అక్రమ్, రామర్తి గోపి, నరేందర్‌గౌడ్, సంతోష్, శ్రీనివాస్, వినయ్, సుభాష్‌జాదవ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మానాల మోహన్‌రెడ్డి, పాల్గొన్న నాయకులు

అవగాహన లేకుంటే అనర్థమే!

● జిల్లాలో తగ్గుముఖం పట్టిన హెచ్‌ఐవీ కేసులు
● అవగాహన కార్యక్రమాలతో పూర్తిస్థాయిలో నివారణకు అధికారుల చర్యలు
● హెచ్‌ఐవీ సోకిన గర్భిణుల నుంచి పుట్టే బిడ్డకు సోకకుండా కాపాడే ప్రయత్నాలు
● నేడు అంతర్జాతీయ ఎయిడ్స్ నివారణ దినం



కామారెడ్డిటౌన్, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): హెచ్‌ఐవీ (హ్యూమన్ ఇమ్యూనో వైరస్) పాజిటివ్. ఈ పేరు చెప్పగానే ప్రజలు హడలిపోయేవారు. గతంలో హెచ్‌ఐవీ సోకిందంటే పురుగును చూసినట్టు చూసేవారు. హెచ్‌ఐవీని నియంత్రించడం కాకుండా శాశ్వత నిర్మూలనే లక్ష్యం కావాలి. హెచ్‌ఐవీ శరీరంలోని ఏ నాడి వ్యవస్థలపై దీని ప్రభావం అధికంగా ఉంటుంది. హెచ్‌ఐవీ సోకినప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి. ఏ మందులు వాడాలనేది అందరికీ తెలిసింది. దీంతో గతంలో కంటే మరణాల సంఖ్య తగ్గింది. భయంకూడా తొలిగిపోయింది. హెచ్‌ఐవీ కలవారు గతంలో నలుగురితో కలిసి మాట్లాడాలన్నా భయపడేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి మారింది. అవగాహన పెరగడంతో జిల్లాలోని కామారెడ్డి జీజీహెచ్ ఆసుపత్రి, బాన్సువాడ ఏరియా ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ఏఆర్‌టీ సెంటర్‌లలో స్వచ్ఛందంగా వచ్చి రోగులు చికిత్స పొందుతున్నారు. మందులు వాడుతున్నారు. హెచ్‌ఐవీ సోకిన గర్భిణుల నుంచి పుట్టే బిడ్డకు సోకకుండా కాపాడే ప్రయత్నాలు వైద్య బృందం చేస్తోంది. అయితే ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలు, స్వచ్ఛంద సంస్థల చైతన్యకార్యక్రమాల వల్ల జిల్లావ్యాప్తంగా హెచ్‌ఐవీ రోగుల్లో అవగాహన పెరుగుతున్నప్పటికీ అవగాహన రాహిత్యంతోనో, నిర్లక్ష్యంతోనో కొందరు ఇష్టారీతిన వ్యవహరిస్తే అనర్థం దరి చేరుతుందనే వైద్యబృందం పేర్కొంటుంది. ప్రాణాంతక వ్యాధిపై అవగాహన కల్పిస్తూ వ్యాధి ఎలా వ్యాపిస్తుంది.. అనే దానిపై ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినం ప్రత్యేక కథనం.

హెచ్‌ఐవీ వ్యాప్తి.. లక్షణాలు

సాధారణంగా అనైతిక లైంగిక సంపర్కం, రక్తం ఎక్కించినప్పుడు, లాలాజలం, జననాంగ స్రావాల వంటి వాటితో హెచ్‌ఐవీ వ్యాపిస్తుంది. హెచ్‌ఐవీ అంటువ్యాధి కాదు. అది వైరస్ వల్ల వ్యాపించే వ్యాధి వైరస్ సోకిన వ్యక్తి రక్తాని మరొకరికి ఎక్కించిన, హెచ్‌ఐవీ సోకిన తల్లి మందులు వాడకుండా బిడ్డకు చనుపాలు ఇచ్చిన బిడ్డకు సైతం సోకుతుంది. హెచ్‌ఐవీ సోకిన వ్యక్తి నెల రోజుల పాటుగా తగ్గకుండా జ్వరం వచ్చినా లేదా బరువు తగ్గిపోవడం,ఎక్కువ రోజులు విరేచనాలు అవడం అదే పనిగా దగ్గు రావడం మందులు వేసుకున్నా తగ్గకపోవడం,ఎప్పుడు ఇన్ఫెక్షన్ రావడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.రక్తంలోని తెల్ల రక్త కణాల్లో సీడీ-4 సంఖ్యను బట్టి హెచ్‌ఐవీ ఎయిడ్స్‌ను గుర్తిస్తారు. ఒక మిల్లీలీటరు రక్తంలో సీడీ-4 కణాల సంఖ్య 500 లేదా అంతకంటే తక్కువ ఉంటే హెచ్‌ఐవీ సోకి రోగ నిరోధక వ్యవస్థ దెబ్బతిన్నట్లు గుర్తిస్తారు.

రోగ నిరోధక వ్యవస్థపై దాడి.. అవగాహన తప్పనిసరి

మానవ శరీరంలోని రోగనిరోధక వ్యవస్థలో సీడీ -4 కణాలు ఎంతో కీలకమైనవి. హెచ్‌ఐవీ పాజిటివ్ బాధితుల్లో వైరస్ సీడీ-4 కణాలపై దాడి చేస్తుంది. ఫలితంగా రోగనిరోధక వ్యవస్థ తీవ్రంగా దెబ్బ తింటుంది. ఆ వైరస్‌ను ప్రభావాన్ని తగ్గించేందుకు ప్రతీనెల అందించే మందులను క్రమంతప్పకుండా వాడాలి. ముఖ్యంగా స్త్రీలు గర్భం దాల్చినప్పుడు తమ పిల్లలకు ఆ వ్యాధి సోకకుండా వైద్యుల సూచనలు పాటించాలి. గతంలో హెచ్‌ఐవీ సోకిన వారిని సమాజం దూరంగా ఉంచేది.ప్రస్తుతం హెచ్‌ఐవీపై అవగాహన పెరగడంతో ధైర్యంగా ముందుకు వచ్చి వైద్యం చేయించుకుంటున్నారు. ఫలితంగా మధు మేహం, హైపర్‌టెన్షన్ వ్యాధుల లాగానే ఎయిడ్స్ హెచ్‌ఐవీని నియంత్రించి దీర్ఘకాలికంగా జీవితాన్ని పెంచే వ్యాధిగా గుర్తిస్తున్నారు.

నియోజకవర్గ అభివృద్ధి కింద జిల్లాకు నిధుల విడుదల

● ప్రతీ నియోజకవర్గానికి రూ.10 కోట్లు ● పనుల కోసం సిఫారసు చేస్తున్న ఎమ్మెల్యేలు

నిజామాబాద్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాకు ఎట్టకేలకు నియోజకవర్గ అభివృద్ధి నిధులు విడుదల అయ్యాయి. కొత్త ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం గడుస్తుండటంతో ప్రభుత్వం నియోజకవర్గానికి పది కోట్ల చొప్పున నిధులను విడుదల చేసింది. జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో నిబంధనలకు అనుగుణంగా పనులను చేపట్టాలని ఆదేశాలను ఇచ్చింది. నిబంధనల మేరకు ఎమ్మెల్యేల నుంచి పనులకు సంబంధించిన వివరాలను తీసుకోవాలని కోరింది. ఆ వివరాల ఆధారంగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనుమతులను తీసుకొని పనులకు ఆమోదం తెలపాలని జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది. సంవత్సరం కాలంగా నియోజకవర్గాల్లో నిధులు లేక ఎదురు చూస్తున్న ఎమ్మెల్యేలు పది కోట్ల రూపాయలతో పనులు చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. అధికార ఎమ్మెల్యేలతో పాటు ప్రతిపక్ష పార్టీల ఎమ్మెల్యేలు ఉన్నచోట కూడా నిధులు ఖర్చు చేసేందుకు సిఫారసులను అందజేస్తున్నారు. ప్రభుత్వం నియోజకవర్గానికి 10 కోట్ల నిధులు కేటాయించడంతో పాటు వీటికోసం నిబంధనలు కూడా విడుదల చేసింది. ఆ నిబంధనల ప్రకారమే జిల్లా ఇంచార్జి మంత్రి అనుమతులు తీసుకొని నిధులను ఖర్చు చేయాలని ఆదేశాలను ఇచ్చింది. నియోజకవర్గ అభివృద్ధి కోసం ఇచ్చిన పది కోట్ల నిధుల్లో రెండు కోట్ల రూపాయలను పాఠశాలల్లో మౌలిక వసతుల కోసం ఖర్చు చేయాలని నిబంధనల్లో పేర్కొన్నారు. ఒక కోటి రూపాయలు తాగునీటి కోసం, ఆరున్నర కోట్ల రూపాయలు నియోజకవర్గంలో అభివృద్ధి పనుల కోసం ఖర్చు చేయాలని పేర్కొన్నారు. మిగతా 50లక్షల రూపాయలను ఆయా శాఖల్లో పనుల కోసం వినియోగించాలని జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీనికి అనుగుణంగా అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఈ నిధులను విడుదల చేశారు. ఈ నిధుల కోసం ప్రతిపక్ష పార్టీల ఎమ్మెల్యేలు ఉన్న చోట సమస్యలు ఎదురవుతున్నాయి. జిల్లా ఇంచార్జి మంత్రి అనుమతులు ఇవ్వనుండటంతో నియోజకవర్గాల్లో పోటీ చేసి ఓటమిపాలైన నేతలు ఈ నిధుల కోసం సిఫారసులు చేస్తున్నారు. ఎమ్మెల్యేలతో పాటు వారు కూడా పనులకు సిఫారసులు ఇస్తుండటంతో అధికారులు కూడా ఆచితూచి నిర్ణయం తీసుకునేందుకు సిద్ధమవుతున్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి తీసుకునే నిర్ణయానికి అనుగుణంగా నిధులను విడుదల చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆరు నియోజకవర్గాల పరిధిలో మొత్తం 55 కోట్ల రూపాయలను విడుదల చేశారు. నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్, బోధన్, ఆర్మూర్, బాల్కొండ నియోజకవర్గాలకు పది కోట్ల చొప్పున బాన్సువాడ నియోజకవర్గానికి రూ.5కోట్లను జిల్లాకు కేటాయించారు. మిగతా రూ.5కోట్లను కామారెడ్డి జిల్లా పరిధిలో బాన్సువాడ నియోజకవర్గానికి ఖర్చు చేయనున్నారు. నిధులు రావడంతో ముఖ్యమైన పనులకు వినియోగించనున్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన దీక్ష


కామారెడ్డిలో నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు


ఎల్లారెడ్డిలో సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసనకు మద్దతు తెలిపిన పీఆర్‌టీయూ నాయకులు

కామారెడ్డిటౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): సమగ్రశిక్ష ఉద్యోగుల సమస్యలు తీర్చాలని కామారెడ్డి ఎంఈవో కార్యాలయం వద్ద సమగ్రశిక్ష ఉద్యోగులు నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిసెంబరు 3 లోగా తమ సమస్యలు నెరవేర్చకుంటే తర్వాత సమ్మెకు వెళ్తమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు శైలాజ, మాధవి, కాళిదాస్, మానస,సారిక, భక్తమాల, కృష్ణంరాజు, గోపాల్, చిరంజీవి, రా ములు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

లింగంపేట: మండల విద్యావనరుల కేంద్రం ముందు నిరసన దీక్ష చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఉపాధ్యాయ సంఘాలు పీఆర్‌టీయూ మండల అధ్యక్షు డు రవీందర్ శర్మ, టీపీయూఎస్ అధ్యక్షుడు సంతోష్, ఎస్సీ ఎస్టీ అధ్యక్షుడు మురళి కృష్ణలు మద్దతు తెలిపారు. ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్ లను నెరవేర్చే వరకు దీక్షను విరమించేది లేదని సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సత్య నారాయణ అన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల నాయకులు రాజిరెడ్డి, సంగమేశ్వర్, సూర్య, సంతోష్‌రెడ్డి, హేమలత, రాజు, సంగాగౌడ్, విజయ్, స్వప్న, అశ్విని ఉన్నారు.

పెద్దకొడప్‌గల్: తమ ఉద్యోగాలకు భద్రత కల్పించడంతో పాటు తమను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ సమగ్ర శిక్షా ఉద్యోగులు శనివారం జుక్కల్ మండల కేంద్రంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్షా ఉద్యోగులు మాట్లాడుతు గత ఎన్నికలకు ముందు సమగ్ర శిక్షా ఉద్యోగులు హన్మకొండలో సమ్మె చేస్తున్న సమయంలో ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి దీక్షా శిబిరాన్ని సందర్శించి తమ ప్రభుత్వం ఏర్పడిన రెండు నెలల్లో సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయడంతో పాటు పే స్కేల్ ఇస్తామని హామీ ఇచ్చి నెలలు గడుస్తున్న అమలు కావడం లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్షా ఉద్యోగులు అశోక్, ఆత్మారాం, మాధప్ప, బిల్లుసింగ్, భీమన్న, విజయ్ ప్రకాష్, భీంరావు, తుకరాం, పండరి, నవనీత్, మొగులప్ప తదితరులు పాల్గొన్నారు.

నిజాంసాగర్: ఉమ్మడి నిజాంసాగర్ సమగ్ర శిక్ష ఉద్యోగుల మండల స్థాయి నిరసన దీక్షకు పీఆర్‌టీయూ మహ్మద్‌నగర్, నిజాంసాగర్ శాఖలు మధ్యాహ్న భోజనం సమయంలో వారి డిమాండ్‌లను పరిష్కరించాలని పాల్గొని వారికి సంఘీభావాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మహ్మద్‌నగర్ అధ్యక్షులు నారాయణ, ప్రధాన కార్యదర్శి వెంకట్‌రాంరెడ్డి, నిజాంసాగర్ ప్రధాన కార్యదర్శి సురేందర్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు వెంకటరమణ, భాస్కర్‌గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు జనార్ధన్, మండల సహ అధ్యక్షులు అజయ్, మండల కార్యదర్శి రాజు, సమగ్ర శిక్ష ఉద్యోగులు పాల్గొన్నారు.

మద్నూర్: మండల కేంద్రంలో తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేపట్టారు. సీఎం ఇచ్చిన హామీ అమలు కోసం పాఠశాల విద్యా శాఖలోని సమగ్ర శిక్ష ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని, తక్షణమే పేస్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. రిలే నిరసన దీక్షకు మండల పీఆర్‌టీయూ ఆపస్ నాయకులు, ఉపాధ్యాయులు సంఘీభావం తెలిపారు. వారి డిమాండ్లను ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆపస్ నాయకులు శివకాంత్, పీఆర్‌టీ యూ నాయకులు సునీల్, శివరాం ఉన్నారు.

నసురుల్లాబాద్: మండల కేంద్రంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించాలని శనివారం సమగ్ర శిక్ష ఉద్యోగులు మండల కేంద్రంలోని విద్యా శాఖ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ నిరసన కార్యక్రమానికి పీఆర్ టీయూ మండల బాధ్యులు విచ్చేసి వారికి సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా పీఆర్‌టీయూ మండల అధ్యక్షులు హన్మాండ్లు మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగుల డిమాండ్లు పరిష్కరించాలని, వారిని రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించి రీ ఎంగేజ్ లేకుండా చూడాలని, మెడికల్ రీయంబర్స్‌మెంట్ సౌకర్యం కల్పించాలని ప్రభు త్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పీఆర్ టీయూ ప్రధాన కార్యదర్శి శ్రీచంద్, రాష్ట్ర బాధ్యులు హన్మాండ్లు, పండరి గౌడ్,కిషన్‌లాల్, గోపాల్, బాలరాజ్ పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి: విద్యాశాఖలో పనిచేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులందరికీ ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించి పే స్కేల్ అమలు చేయాలని శనివారం ఎల్లారెడ్డి విద్యా వనరుల కేంద్రం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారంలోకి రాగానే పేస్కేల్ కల్పిస్తామని హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. వారికి మద్దతుగా పీఆర్‌టీయూ మండల అధ్యక్షులు శ్రీనివాస్ సంఘ నాయకులు మద్దతు తెలిపారు.

మద్నూర్: మండల కేంద్రంలో తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలోనిరసన దీక్ష చేపట్టారు. సీఎం ఇచ్చిన హామీ అమలు కోసం పాఠశాల విద్యా శాఖలోని సమగ్ర శిక్ష ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని, తక్షణమే పే స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆపస్ నాయకులు శివకాంత్, పీఆర్‌టీయూ నాయకులు సునీల్, శివరాం, సిబ్బంది, రవికాంత్, జ్యోతి, అశోక్ తదితరులు ఉన్నారు.


అయ్యప్ప స్వామికి అభిషేకం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు

అయ్యప్ప పడిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే

నాగిరెడ్డిపేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): నాగిరెడ్డిపేట మండల కేంద్రంలో గ్రామానికి చెందిన అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి అయ్యప్ప స్వామి మహా పడిపూజను అయ్యప్ప మాలధారులు ఘనంగా నిర్వహించారు. ఈ అయ్యప్ప స్వామి మహా పడిపూజలో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన అయ్యప్ప స్వామి విగ్రహానికి అభిషేకాలు చేసి, అయ్యప్ప స్వాములతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్, ఉపాధ్యక్షుడు లక్ష్మణ్ ఠాగూర్, గ్రామ అధ్యక్షుడు సాయాగౌడ్, మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను అభివృద్ధి చేస్తాం

సదాశివనగర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలను ప్రజలకు, నిరుద్యోగయువతకుపూర్తిగా అందుబాటులో ఉండే విధంగా మరింత అభివృద్ధి చేసుకుందామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్దిచంద్రకాంత్‌రెడ్డి అన్నారు. శనివారం సదాశివనగర్ మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని పూరతన గ్రంథాలయ భవనాలకు రంగులువేసి కావాల్సిన పుస్తకాలను అందుబాటులో ఉండే విధంగా చర్యలు చేపడతామన్నారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ సదాశివరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, బాగయ్య, రాజేందర్, సంగయ్య, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతు పండుగను వీక్షించిన మండల రైతులు

పెద్దకొడప్‌గల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లాలో నిర్వహించిన రైతు పండుగ సమావేశానికి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరు కాగా పెద్ద కొడప్‌గల్ రైతు వేదికలో ఈ కార్యక్రమాన్ని మండల రైతులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్ దేశంలో రైతులకు సంబంధించిన రుణాలు వేల కోట్లు మాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే అని తెలియజేయడంతో మండల రైతులు సంతోషం వ్యక్తం చేశారు.దీంతో పాటుగానే సన్నరకం ధాన్యానికి బోనస్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే అని సీఎం పేర్కొనడంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు. దీంతో పాటుగానే లగచర్ల ఘటనలో ప్రతిపక్షాల మాయలో పడొద్దని సిఎం రేవంత్ రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏవో కిషన్, ఏఈవోలు రూప, రాజ్యలక్ష్మి, మాధవి, కాంగ్రెస్ నాయకులు మహేందర్ రెడ్డి, నాయకులు నాగి రెడ్డి, చిప్ప మోహన్, రైతులు పాల్గొన్నారు.

సీఎం ముఖాముఖిలో పాల్గొన్న రైతులు

బీర్కూర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం ప్రత్యక్ష ప్రసారం కార్యక్రమం నిర్వహించారు. బీర్కూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన సీఎం వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమం మండల ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొని కార్యక్రమాన్ని వీక్షించారు. సన్న ధాన్యానికి బోనస్, రైతు రుణమాఫీ తదితర అంశాలపై సీఎం చేసిన ప్రసంగాన్ని రైతులు విన్నారు.

లింగంపేట: ప్రజా ప్రభుత్వ విజయోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతు పండుగ నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన రైతులు మహబూబ్ నగర్‌లో సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగాన్ని టీవీలో ఆసక్తిగా విన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ దేవెందర్‌రెడ్డి, మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు నారాగౌడ్, ఏవో అనిల్‌కుమార్, నాయకులు కౌడ రవి, సాయికుమార్, అశోక్ పాల్గొన్నారు.

అనారోగ్యంతో కళ్యాణి మాజీ ఎంపీటీసీ మృతి



ఎల్లారెడ్డి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కళ్యాణి గ్రామ మాజీ ఎంపీటీసీ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత శర్వాయి గారి శ్రీధర్‌గౌడ్ (49) శనివారం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. శ్రీధర్‌గౌడ్ మృతి పట్ల ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు, మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కురుమ సాయిబాబా సంతాపం వ్యక్తం చేశారు.

● ఎంపీటీసీ శ్రీధర్‌గౌడ్ మృతి పట్ల ఎమ్మెల్యే సంతాపం

ఎల్లారెడ్డి మండలంలోని కళ్యాణి గ్రామ మాజీ ఎంపీటీసీ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు శ్రీధర్‌గౌడ్ మృతి పట్ల ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఓ మంచి నాయకున్ని కోల్పోయిందని, శ్రీధన్‌గౌడ్ తన మంచి అనుచరుడని ఆయన ఆత్మకుశాంతి చేకూరాలని భగవంతున్ని కోరుతున్నట్లు తెలిపారు. అతని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తంచేశారు.

సంగమేశ్వర్‌లో ఉచిత పశువైద్య శిబిరం

దోమకొండ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంగమేశ్వర్‌లో తెలంగాణ పశుగానాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పశువైద్యాధికారి శివ పశువులకు చికిత్సలు నిర్వహించారు. కార్యక్రమంలో పశుగానాభివృది సంస్థ ఏడీ అబ్దుల్ మజీద్, డాక్టర్ రమేష్, డీఎల్‌డీఏ సూపర్ వైజర్ కృష్ణ జేవీవో కిషోర్, లింగం, రమేష్, మహేష్‌గౌడ్, బాబు, భూమయ్య ఇర్ఫాన్ పాల్గొన్నారు.

ఉచిత గర్భకోశ చికిత్స శిబిరం

గాంధారి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): సీతాయిపల్లి గ్రామంలో ఉచిత గర్భకోశ చికిత్స శిబిరం శనివారం నిర్వహించారు. ఈ శిబిరానికి పశుగణాభివృద్ధి సంస్థ వారు మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరంలో గర్భకోశ వ్యాధులకు 24 కృత్రిమ గర్భధారణ 4 సాధారణ చికిత్స ఐదు నట్టల నివారణ 23 మొత్తం 51 పశువులకు మందులు పంపిణీచేశారు. ఈ శిబిరంలో పశుగణాభివృద్ధి సంస్థకార్య నిర్వహణాధికారి డాక్టర్‌మాజీద్‌మైమద్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించిన మాజీ ఎంపీపీ

రామారెడ్డి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రామారెడ్డి మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల/బాలుర ఉన్నత పాఠశాలలో బియ్యంలో పురుగులు వస్తున్న సందర్భంలో శుక్రవారం వచ్చిన వార్త కథనానికి శనివారం నాయకులు స్పందించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని భోజనశాలను మాజీ ఎంపీపీ దశరథ్ రెడ్డి పిల్లలకు పెట్టే భోజనం నాణ్యంగా ఉండాలని, లేనిపక్షంలో అధికారులను ప్రభుత్వాన్ని నిలదీయడం జరుగుతుందని హెచ్చరించారు.

గుర్తుతెలియని వ్యక్తి హత్య


మృతదేహాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ, పట్టణ సీఐ

కామారెడ్డిటౌన్,నవంబరు 30(ఆంధ్రజ్యోతి):కామారెడ్డి జిల్లా కేంద్రంలోని గాంధీ గంజ్ ఇంటిగ్రేటెడ్ మార్కెట్ కాంప్లెక్స్‌లో శనివారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తి హత్యజరిగినట్లు కామారెడ్డి పట్టణ సీఐచంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. మార్కెట్ కమిటి కార్యదర్శి నర్సింలు హత్యజరిగిన విషయాన్ని సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని డీఎస్పీ నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో పరిశీలించామని తెలిపారు. మృతిచెందిన వ్యక్తి వద్ద ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో చుట్టుపక్కల వారిని ఆరాతీయగా సాయి అలియాస్ యేసు అని చెప్పారని వయస్సు 30 నుంచి 40 సంవత్సరాల మధ్య ఉంటుందని తెలిపారు. రోజులాగే పడుకునే ప్రాంతంలో పక్కన ఉన్న వేరొక రాష్ట్రానికి చెందిన భార్యభార్తలతో గొడవజరగగా వారు ఇతనిని ఏదో ఒక ఆయుధంతో కొట్టి చంపి ఉండవచ్చని దరఖాస్తుచేశారని తెలిపారు. మృతిచెందిన వ్యక్తి కుడిచేతిపై శ్రావణ్య అని ఇంగ్లీష్‌లో పచ్చబొట్టు కలదని, ఎడమచేతిపై త్రిశూలం, డమరుకం, ఓం అనే పచ్చబొట్టు కలదని తెలిపారు. అతనిని హత్యచేసిన వారిని పట్టుకోవడం కోసం ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటుచేసి చనిపోయిన వ్యక్తి ఆచూకి తెలుసుకోవడం కోసం మరోక టీంను ఏర్పాటుచేయడం జరిగిందని అన్నారు. మృతుడి వివరాలు తెలిస్తే పట్టణ పోలీసుస్టేషన్‌లో తెలుపాలని సీఐ కోరారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

కామారెడ్డిటౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి మండలంలోని ఉగ్రవాయి శివారులోని హైటెన్షన్ వైర్లకు సమీపంలో కామారెడ్డి పట్టణంలోని గోసంగి కాలనీకి చెందిన కోదండం రాజు అనుమానస్పద స్థితిలో మృతిచెందినట్లు గుర్తించామని దేవునిపల్లి ఎస్ఐ రాజు తెలిపారు. శనివారం ఉదయం గుర్తుతెలియని వ్యక్తి మృతిచెంది ఉన్నాడని సమాచారం రావడంతోసంఘటన స్థలానికి వెళ్లి విచారణ చేపట్టగా గోసంగి కాలనీకి చెందిన రాజుగా తెలిసిందని తెలిపారు. ఏ విధంగా మృతి చెందాడనేది తెలియరాలేదని పోస్టుమార్టం కోసం కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.


మృతిచెందిన కోదండం రాజు

ప్రభుత్వ పాఠశాలల బంద్ విజయవంతం

కామారెడ్డిటౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో శనివారం ఇచ్చిన ప్రభుత్వ పాఠశాలలబంద్ విజయవంతమైనట్లు పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సురేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అరుణ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకుడు శివ,బీవీఎం రాష్ట్ర కార్యదర్శి విఠల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మణికంఠ, సంపత్, కృష్ణ,సతీష్, శ్రీరాం, శ్రీకాంత్, మణికంఠ పాల్గొన్నారు.

పెద్దకొడప్‌గల్: జుక్కల్ మండల కేంద్రంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శనివారం పాఠశాలలు మూసి వేయించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు ఫిర్దోస్ మాట్లాడుతూ ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లో ప్రభుత్వ వైఫల్యం వల్ల విద్యార్థులకు నాణ్యమైన భోజనం అంద డం లేదని తెలిపారు. ప్రభుత్వం వెంటనే సమస్యలను పరిష్కరిం చాలని లేదంటే ఆందోళనలు ఉదృతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్ర మంలో ఎస్ఎఫ్ఐ నాయకులు జాబిర్, రాహుల్, జుమిల్, ఈశ్వర్ పాల్గొన్నారు.

కేజీబీవీలో ఖాళీలకు దరఖాస్తు చేసుకోవాలి

బిచ్కుంద, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలానికి చెందిన కేజీబీవీ కళాశాలలో ఖాళీగా ఉన్న పోస్టులకు ఈనెల 2 సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ఎస్ఓ రజిని తెలిపారు. పీజీసీఆర్‌టీ ఇంగ్లీష్,సివిక్స్ నర్సింగ్ ఖాళీలకు బీఎడ్,పీజీ అర్హత ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

బీర్కూర్‌లో పర్యావరణ పరిరక్షణ కార్యక్రమం

బీర్కూర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ పాటశాలలో శనివారం కౌన్సిల్ ఫర్ గ్రీన్ రివలేషన్ వారి ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ కార్యక్రమం నిర్వహిం చారు. ఇందులో భాగంగా పాఠశాల సంఘాలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం అడ్మిన్ అనుదీప్, కో ఆర్డినేటర్ రవిలు మాట్లాడారు. విద్యార్థులు పర్యావరణ పరిరక్షణ గురించి వివరించడంతో పాటు ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే నష్టాలు, భూ సంరక్షణ గురించి అవగాహన కల్పించారు.

తహసీల్ కార్యాలయానికి ఫర్నిచర్ వితరణ

లింగంపేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): లింగంపేట తహసీల్ కార్యాలయానికి శనివారం హైకోర్టు సీనియర్ న్యాయవాది మోహిన్ మైమద్ ఖాద్రీ రూ.50వేలు విలువ చేసే ఫర్నిచర్‌ను వితరణ చేశారు. కార్యాలయంలో ఫర్నిచర్ లేకపోవడంతో పాటు ఉన్న ఫర్నిచర్ పూర్తిగా చెడిపోవడంతో ఆయన ఫర్నిచర్‌ను అందజేశారు. కార్యక్రమంలో డీటీ భిక్షపతి, నాయకులు రవిగౌడ్, శ్రీకాంత్, గౌతమ్‌లతో పాటు సిబ్బంది ఉన్నారు.

మాలల సింహ గర్జనను విజయవంతం చేయాలి

నిజాంసాగర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ మండలంలోని పోచారం గ్రామంలో హైదరాబాద్‌లో మాలల సింహ గర్జనను విజయవంతం చేయాలని సభ కరపత్రాలను శనివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం రాష్ట్ర ఉపా ధ్యక్షులు మైసయ్య, బాన్సువాడ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నెర్రె నర్సింలు, ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం డివిజన్ అధ్యక్షులు దేశాయిపేట ప్రశాంత్ అంబేద్కర్, సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గైని రవి, అంబేద్కర్ సంఘం డివిజన్ ఉపాధ్యక్షులు చిన్న సాయిలు పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందనలు

నసురుల్లాబాద్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంకోల్ తండా గ్రామంలో గల అంకోల్ తండా డీఎస్‌టీ పాఠశాల విద్యార్థిని గణిత శాస్త్రంలో మండల స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకుగాను శనివారం పాఠశాల ఉపాధ్యాయ బృందంతో పాటు, ప్రధానోపాధ్యాయులు బాలరాజు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగేళ్లుగా మండల స్థాయి గణిత పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరచడం సంతోషకరమన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే రైతుల ఆర్థికాభివృద్ధి

● ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి


మహబూబ్‌నగర్‌లో స్టాళ్లను పరిశీలిస్తున్న ప్రభుత్వ సలహాదారు పోచారం, ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్

బాన్సువాడ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వంతోనే రైతులు ఆర్థిక అభివృద్ధి సాధిస్తారని ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం మహబూబ్‌నగర్‌లో జరిగిన రైతు పండుగ కార్యక్రమంలో రైతులు ప్రదర్శించిన వ్యవసాయానికి సంబంధించిన వివిధ స్టాళ్లను వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్‌లు సందర్శించారు. రైతులు ప్రదర్శించిన వివిధ పరికరాలను పరిశీలించి రైతులకు ఎలాంటి మేలు జరుగుతుందో వివరించారు. రైతులు ప్రదర్శించిన ఉత్తమ పరికరాలను, వివిధ రకాల వస్తువులను ప్రదర్శించినందుకు రైతులను అభినందించారు.

కాంగ్రెస్ ఉపాధ్యక్షుడికి స్వాగతం

తాడ్వాయి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకునరి చలో ఢిల్లీ కార్యక్రమంలో భాగంగా గౌరవ ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు ఆదేశాల మేరకు గౌరవ ఎస్సీ కార్పొ రేషన్ చైర్మన్ ప్రీతం ఆధ్వర్యంలో నిర్వహించిన రాజ్యాంగ దినోత్సవ వేడుకలలో పాల్గొని విజయ వంతంగా స్వగ్రామానికి చేరుకున్న సందర్భంగా తాడ్వాయి మండల సంగోజివాడి గ్రామస్థులు, మండల ఉపాధ్యక్షులు గైని శివాజీ ఘన స్వాగతం పలికి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షులు గడ్డం లింగం, యూత్ అధ్యక్షులు ప్రశాంత్, మైనారిటీ అధ్యక్షులు మహబూబ్, గంగారాం, మల్లనోల్ల భూమయ్య, బాలరాజు, లింగం, చిన్న సాయిలు, ఆసిఫ్, సత్యం, హమీద్, రాములు, పెద్ద నర్సింలు, రవి, శంకర్, రాజేందర్, ఫారూక్, రాజు, ప్రకాష్, పురుషోత్తం పాల్గొన్నారు.

నూతన భవన నిర్మాణానికి కృషిచేస్తా


రికార్డులను పరిశీలిస్తున్న చైర్మన్

గాంధారి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గల గ్రంథాలయాన్ని శనివారం చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి పరిశీలించారు. గ్రంథాలయ భవనం శిథిలవస్థకు చేరుకుని ఉండడంతో ఆ భవనాన్ని పరిశీలించి అద్దెభవనంలో కొనసాగుతున్న గ్రంథాలయంలో రికార్డులని పరిశీలించి లైబ్రరియన్‌తో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే నూతన భవనం ఏర్పాట్లు చేసి అందులోకి గ్రంథాలయాన్ని నిర్వహించేలా చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పరమేష్, డీసీసీబీ జిల్లా డైరెక్టర్ సాయికుమార్, మాజీ సర్పంచ్ సంజీవ్ పాల్గొన్నారు.

AJ CLASSIFIEDS

పొలం అమ్మబడును

గూపన్‌పల్లి గ్రామం ప్రక్కన కేశపూర్ గ్రామంలో రైతు వేదిక ప్రక్కన 33 ఫీట్ల బీటీరోడ్ మంజూరైంది.దాన్ని ఆనుకొని 1/2 ఎకరం నుండి 1 1/2 ఎకరం వరకు వ్యవసాయ భూమి అమ్మకానికి కలదు. 9908805334
AJZ

CHANGE OF NAME

I, BODAS RAJALINGAM S/O CHINNA NARSAIAH BODAS, H.NO. 4-2/1, CHITTAPUR (V), MANDAL: BALKONDA, DIST. NIZAMABAD, T.G. INDIA CHANGED MY FATHER NAME AS BODAS NARSAIAH
AJZ

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడిన లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

Classifieds
మీ అభిమాన ఆంధ్రజ్యోతి
ప్రతి రోజు క్లాసిఫైడ్స్

-: సంప్రదించవలసిన నెంబరు :-
కామారెడ్డి : 9985411453

తాడ్వాయిలో వైద్య శిబిరం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తాడ్వాయి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): శుక్రవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వార్తపై తాడ్వాయి మండల అధికారులు స్పందించి సోమ వారం గ్రామంలో హెల్త్ క్యాంపు ఏర్పాటు చేశారు. చికెన్ గున్యా వ్యాధులపై వస్తున్న అపోహలను నమ్మవద్దని అధికారులు గ్రామస్థులకు సూచించారు. గ్రామంలో ఇంటింటి సర్వే చేపట్టారు. ఉష్ణోగ్రతల ప్రభావం వల్ల కాళ్ల నొప్పులు వస్తుంటాయని వారు తెలిపారు. గ్రామంలో ఉన్న మురుగు నీటి కాలువలను, నీటి ట్యాంకు ఉన్న చెత్తను శనివారం అధికారులు తొలగించారు. అనంతరం గ్రామస్థులతో ఎంపీవో సవితా రెడ్డి మాట్లాడారు. ఏవైనా ఇబ్బందులు ఉంటే వైద్య శిబిరాన్ని సందర్శించి తగు మందులు తీసుకోవాలని గ్రామస్తులకు సూచించారు. గ్రామంలో మొత్తం సర్వే నిర్వహించగా ఐదు కుటుంబాలకు జ్వరం ఉందని నిర్ధారించారు. గ్రామాల్లో విష జ్వరాలు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటామని తెలిపారు. వాతావరణ పరిస్థితుల వల్ల చలి తీవ్రత వల్ల కాళ్లు వేళ్లు కొంకపోవ డం జరుగుతుందని తెలిపారు. ఇందులో మండల అధికారులు, వైద్య సిబ్బంది ఉన్నారు.


గ్రామస్తులతో మాట్లాడుతున్న మండల వైద్యాధికారులు

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

శాంతి	రోటీ కపడా రోమాన్స్
దర్శన్	ఝాన్సీ ఐపీఎస్
ప్రియా 35	అమరన్
ప్రియా 70	మెకానిక్ రాకి

బాన్సువాడ

మహేశ్వరి	మెకానిక్ రాఖీ
వెంకటేశ్వర	కేసీఆర్ (కేశవ చంద్ర రమావత్)

చికెన్ ధరలు



రకం		లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	140	180	200
పెనకాబ్(కిలో)	:	130	160	190

